


## కొవ్వలి నవలల్లో కొన్ని...

'కొవ్వలి' అనే పేరు తెలుగు నవలా ప్రపంచంలో ఒక తరం పాఠకులకు చాలా చిరపరిచితం. ముఖ్యంగా మధ్య తరగతి వారిలో పఠనాభిలాషను పెంచిన రచయిత శ్రీ కొవ్వలి లక్ష్మీనరసింహారావు. అరవైయ్యేళ్ళు నిండేనాటికి వెయ్యి నవలలు రాసిన ప్రతిభ ఆయనది. ఆనాటి పాఠకులనాడి తెలుసుకుని కళాత్మకంగా పాత్రల్ని మలుచుకుంటూ చమత్కారంగా కథని నడిపించేవారు. పెద్దలూ పిల్లలూ, ఆడవాళ్లూ మగవాళ్లూ విరగబడి చదివిన ఈ వెయ్యి నవలల్లో కొన్నింటిని ఆంధ్రభూమి మాస పత్రిక పాఠకులకోసం ఈ నెలనుంచీ అందిస్తున్నాం.

అరవైఏళ్ళక్రితం వచ్చిన 'అలివేణి' కొవ్వలి వెయ్యిన్నొక్క రచనలలో ఒకటి.

స్త్రీ స్వేచ్ఛావంతురాలనీ తన జీవితాన్ని తనకు అనుగుణంగా సాధికారికంగా మలుచుకునే హక్కు ఆమెకుందనీ 'ఫెమినిజం' అంటే అదేనని ఈనాడు చెప్పుకుంటున్నాం. కానీ అరవైఏళ్ళ క్రితమే ఇలాంటి భావాలను సమర్థించిన రచన 'అలివేణి'

ఏదో ఉద్యోగం వెలగపెట్టడమే ఘనత అనీ, అందులో పై సంపాదన చేస్తూ క్రిందవాళ్లను దోచి, పైవాళ్ళను మంచి చేసుకుంటూ భార్యమీద పెత్తనం చేయడం గొప్ప అనీ, కోడలు అంటే అణగిమణగి వుండేది తప్ప మరేమీ కాదనీ అనుకునే కొడుకూ, అతని తల్లీ ఒక పార్శ్వం అయితే, ఒక వంక వితంతు ఉద్ధరణనూ, మరోవంక భర్తను అర్థం చేసుకుని, తమ కుటుంబవున్నతికి కారణమైన స్త్రీని సవతిగాకాక చెల్లెలిగా సమాదరించిన ఇల్లాలి వైఖరి నిజంగానే అప్పటి కాలానికి సంచలనాత్మక అభ్యుదయ దృక్పథమే.

సరళమైన భాషలో, సహజమైన సంభాషణా ధోరణిలో విభిన్న మానవనైజాలకు అద్దంపట్టే పాత్రలతో అరవై ఏళ్ల క్రితమే అబ్బురపరిచే అభ్యుదయ చింతనతో కొవ్వలి కలం నుండి వెలువడన ఈ నవలను యధాతథంగా ఈతరం పాఠకులకు 'ఆంధ్రభూమి' అందిస్తోంది. చదివి మీ ప్రతిస్పందనలను రాస్తారుగా!

-సుధామ

## ఆ రెండూ ఎదురిళ్లు.

"ఏమండీ అచ్చమ్మగారూ! వాకిట్లో నిలుచున్నారేం? ఎవరి కోసమో ఎదురు చూస్తున్నారు?" అని ఎదురించి అన్నపూర్ణ అడిగినదానికి అచ్చమ్మగారు మరో రెండడుగులివతలికొచ్చి-

"మా ఆమదాలింకా ఇంటికి రాలేదమ్మా. అందుకనే చూస్తున్నాను. పన్నెండు కూడా దాటింది."

"ఆమదాలెవరండీ?"

"మా అబ్బాయి. ఉద్యోగం చేస్తున్నాడాఫీసులో. ఎంతకీ రాడు. ఆఫీసు ఉద్యోగమంటే మాటలా అమ్మా మరీ?"

"ఏం ఉద్యోగమండీ మీ అబ్బాయికీ?"

"ఆఫీసులో ఉద్యోగం. తండ్రి తాతల నుంచీ మావాళ్లందరూ ఇట్లాగే ఉద్యోగాలు చేసి గౌరవంగా బ్రతికారు"

"ఏ ఆఫీసులోనండీ మీ అబ్బాయికి ఉద్యోగం?"

"మా అబ్బాయికేనా? మునుసుపాల్టీ ఆఫీసులో ఉద్యోగం"

"జీతమెంతండీ?"

"పన్నెండు"

"ఆహా.."

"క్రమంగా ఇంకా వృద్ధవుతుంది."

"ఏం ఉద్యోగమో?"

"ఆ పేర్లన్నీ నాకు రావు. మెడలో బిళ్లా అదీ వుంటుంది. మీరెప్పుడూ చూళ్లేదుగామోసు. పాకీవాళ్లమీద అజమాయిషీ"

అని అచ్చమ్మగారు చెప్పిన మాటలు విని అన్నపూర్ణ ఓ వేడి నిట్టూర్పును విడిచింది.

"మీ వారికి ఏం ఉద్యోగమమ్మా?"

"ఇంకా ఏమీ దొరకలేదండి. ప్రయత్నం చేస్తున్నారు."

"ఇంతేనా? ఉద్యోగం పురుషలక్షణమన్నారు. ఏదో ఒక ఉద్యోగం సంపాదించాలిగానీ మొగాడెప్పుడూ ఉద్యోగం లేకుండా ఉండకూడదు"

అని అచ్చమ్మగారు తిరిగి అన్నదానికి అన్నపూర్ణ ఏమీ జవాబు చెప్పలేదు.

"అయితే మీవారికి ఏమీ చదువు రాదా ఏమిటమ్మా?"

"అయ్యో రాకేమండీ. బియ్యే పాసయినారు"

"అంత చదువూ చదువుకుని గోళ్లు గిల్లుకుంటూ ఇంట్లో కూర్చున్నాడన్నమాట?"

"ప్రయత్న లోపం లేదండీ. ఎక్కడా నౌఖరీ దొరక్కపోతే ఏం చేస్తారు?"

"అఘోరించినట్లే ఉంది. మరయితే సంసారమెలా గడుస్తుందమ్మా?"

అన్నపూర్ణ మాట్లాడలేదు.

"ఉద్యోగం చేయడానికి ఎన్ని తెలివితేటలుండాలమ్మా! మావాడు గాబట్టి చేయగలుగుతున్నాడు" అంటూ కనుచూపు మేరలో అవుపించిన కొడుకును చూసి "అడుగో వస్తున్నాడు మావాడు. ఉద్యోగం చేసి వస్తున్నాడు. వాడికి నీళ్లు, అన్నము వగయిరాలు చూడాలమ్మా" అంటూ అచ్చమ్మ లోపలకెళ్లిపోయింది,

అనంతరం ఆమదాలు చేతిలో ఒక గొడుగు, తలకో పాగా, మెడలో డవాలు, కాళ్లకి ఆకుచెప్పులు వగయిరాలతో ప్రవేశిస్తున్నాడు.

అతనికి సుమారు పాతికేళ్ల వయస్సు, నల్లగా, మోటుగా ఉంటాడు. అన్నపూర్ణ ఆ ఇంట్లో కాపురమొచ్చాక అతనిని చూడడం అదే మొదటిసారి.

'ఏదో ఉద్యోగమని గొప్పగా చెప్పిందచ్చమ్మగారు. ఈతనికి బంట్రోతు నౌఖరీ కాబోలు. అవును అది బంట్రోతు ఉద్యోగం గాదూ?' అని తనలో అనుకుంది.

"ఒచ్చవా నాయనా! చాలా పొద్దుపోయింది" అంటూ అచ్చమ్మ అతని చేతలోని గొడుగు వగైరాలనందుకుని "స్నానం చేదువుగానీ రా" అంది.

"అబ్బా... ఏం స్నానముండవే. పాకీ ముండావాళ్లు నా ప్రాణం తీస్తున్నారు. చెప్పినట్లు వినరు. ఈవేళ ఒక్కొక్కడికీ పావలా జుల్మానా వేయించాను. తెగులు కుదిరింది."

"వాళ్లకు జుల్మానా వేయించే అధికారం కూడా నీదేనా నాయనా?"

"ఆ...డొక్కలు బద్దలుచేసి..."

"చూసావా ఉద్యోగమంటే ఇటువంటి అధికారాలన్నీ ఉంటాయి."

"రోడ్లన్నీ పరిశుభ్రం చేసే అధికారంకూడా నాదేనే అమ్మా"

"ఆ..."

"పాకీవాళ్లందరూ నేనంటే హడలిపోతూ ఉండాలసిందే!"

"అవునవును... ఉద్యోగమంటే అంత గౌరవమూ, అన్ని అధికారాలూ ఉంటాయి. ముందుగా లేచి స్నానం చేయి. భోజనానికి ఆలస్యమైపోతుంది."

ఆమదాలు దుస్తులు వగైరాలను తీసుకోవడానికి వెళ్లాడు.

అనంతరం అచ్చమ్మగారతనికి భోజనం పెట్టి దగ్గర కూర్చుంది.

ఆమదాలు అన్నం తింటూ "ఏమే అమ్మా! నాకు ఉద్యోగం దొరికింది కదా, ఇహ పెళ్లి ప్రయత్నం చేయవూ?" అని అడిగాడు.

"అయ్యో ఎందుకు చేయను నాయనా! చేస్తూనే వున్నాను, రోజు రావాలి కదా"

"నాకు పాతికేళ్లు కూడా దాటిపోతున్నాయి. ఇక గట్టి ప్రయత్నం చేయాలి. పెళ్లి చేసుకోవాలని నాకు చాలా సరదాగా ఉంది. ఉద్యోగముండీన్నీ భార్య లేకపోవడం ఏమీ బాగుండలేదు."

"కొద్దిరోజులు ఓపిక పట్టయ్యా... నీకు మాణిక్యంలాంటి పెళ్లాం దొరుకుతుంది."

"అబ్బా...ఇంకా యెంతకాలమే ఓపిక పట్టడం? పెళ్లాముంటే ఎంత బావుంటుంది? నా దగ్గర పని చేసే పాకీవాళ్లందరికీ పెళ్లాలున్నారు."

"ఓరి వెర్రినాయనా! పెళ్లామంటే నీకెంత ముచ్చటగా ఉందిరా. ఇంతకీ కళ్యాణం రావాలి. వస్తుంది. ఎందుకు రాదు? ఉద్యోగం చేస్తున్న నీకు పెళ్లి కాకపోతే ఇంకెవరికవుతుంది?"

"సరేగానమ్మా... నాకెల్లాంటి పెళ్లామయితే బావుంటుందీ?"

"ఏమో నాయనా! భగవంతుడెవర్ని ప్రసాదిస్తాడో ఎవరు చెప్పగలరు?"

"మనయిష్టమొచ్చినవాళ్లను చేసుకుంటాముగానీ భగవంతుడిచ్చిన వాళ్లనెందుకు చేసుకుంటాము?"

"అలా అనుకోకూడదు తప్పు. అంతా భగవంతుడి దయ. నీకు ఉద్యోగం ఇప్పించినవాడు భగవంతుడు. నీకు పెళ్లి చేయగలవాడు కూడా భగవంతుడే"

"ఏది ఏమయినా నాకు నచ్చిన భార్య దొరక్కపోతే మాత్రం నేనూరుకునేది లేదమ్మా" అని అప్పటికి భోజనమైపోవడంవల్ల కంచం దగ్గర నుండి లేచిపోయాడు ఆమదాలు.

★★★


చిరిగిపోయివున్న దుస్తులతోను, ఆకలితో మండుతున్న కడుపుతోనూ నరహరి ఇల్లు చేరుకున్నాడు. అన్నపూర్ణ అతని దైన్యస్థితిని గమనించి భరించలేకపోయింది.

ఒకరి ముఖాలొకరు చూచుకుని నిట్టూర్పులు విడిచారు.

"నాకిక ఉద్యోగం దొరకదు అన్నపూర్ణ. లాభంలేదు. చేసిన ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరులా అయ్యాయి."

"పోనీలెండి. మన దరిద్రగొట్టు దినాలింకా ఉన్నాయి కాబోలు. ఏం చేస్తాం?"

"ఇంత విశాల ప్రపంచముంది. ఏదో ఒక ఉద్యోగం దొరుకుతూనే



## అరుదుగా వచ్చే పాత్రలు

'రావణ్' చిత్రంలోని నా పాత్రను దర్శకుడు మణిరత్నం చాలా అద్భుతంగా తీర్చిదిద్దారు. నటనకు మంచి అవకాశమున్న పాత్ర ఇది. ఎప్పటికో గానీ ఇటువంటి పాత్రలు మనకు లభించవు. అవి వచ్చినప్పుడే వాటిని సద్వినియోగం చేసుకోవాలి. అదీకాకుండా ఒకేసారి రెండు వేరు వేరు భాషల్లో నటించడం కూడా చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. ఈ చిత్రంలోని నా నటనకు ప్రేక్షకుల ప్రశంసలు తప్పకుండా దొరుకుతుందన్న నమ్మకం నాకుంది' అంటూ దర్శకుడు మణిరత్నంకు కృతజ్ఞతలు తెలుపుకుంది ఐశ్వర్యారాయ్.



వుంది. కొద్దో గొప్పో సంపాదించుకుని ఎవరి మట్టుకువారు బ్రతుకుతూ ఉన్నారు. నాకు మాత్రం కనుచూపు మేరలో ఏమీ అవుపించడంలేదు. ఏది ప్రయత్నం చేస్తే అదే విఫలవుతూంది. ఎందరి నాశ్రయించినా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం దొరకడంలేదు''

''అది మన దురదృష్టం. మన ఇంటికెదురుగుండా వున్న ఆమదాలు చూడండీ. చదువు సంధ్యలేమీలేవు. మునిసిపాలిటీలో ఉద్యోగం. తన తాహతుకు తగినట్లుగా ఏదో సంపాదించుకుంటున్నాడు. తల్లీ, అతనూ దానివల్ల కాలక్షేపం చేస్తున్నారు. బి.ఎ ప్యాసయినప్పటికీ మనకే ఉద్యోగం దొరకడంలేదు''

''మనలాంటివాళ్లింకా ఎంతోమంది నౌఖరీల్లేక అఘోరిస్తున్నారు. ఇప్పుడింతకూ ఈ పూటయినా ఇంట్లో యేమయినా ఉందా?'' అని భర్త అడిగినదానికి అన్నపూర్ణ మౌనము వహించి తలను కిందకు దించుకుంది.

''అవును.. ఎలా వస్తుంది? నేనేమీ సంపాదించుకురాకుండా ఇంట్లో యేమయినా ఉందా అని అడగడం మరో బుద్ధితక్కువ...'' అని నరహరి తన్ను తానే నిందించుకున్నాడు.

''ఈ పూటకో సేరు బియ్యం బదులీయవలసిందని అచ్చమ్మగారినడిగాను. ఆమె ఇస్తానంది'' అంటూ అన్నపూర్ణ అచ్చమ్మగారింటివైపు వెళ్లింది.

''చివరకు నేనెటువంటి అప్రయోజకుడ్నయిపోయాను? ఒక్క పూటకయినా బత్తెమును సంపాదించుకోలేని అశక్తుణ్నయ్యాను. బిఎ పాసయి, చాలినంత వివేకము, సామర్థ్యమునూ కలిగి ఉండీన్నీ ఇలా ఎందుకూ పనికిరానివాడినయ్యానెందుకో? ఇటువంటి నీచపు బ్రతుకు బ్రతికేకంటే ఆత్మహత్య చేసుకుని చావడం మంచిదికదా! నావంటి అప్రయోజకుడికి భార్య అనీ సంసారమనీ దేనికీ? ఛీ... భార్యను పోషించలేని బ్రతుకైపోయిందికదా. భార్యదాకా ఎందుకూ? నన్ను నేనే పోషించుకోలేని స్థితిలోకొచ్చాను. ఉన్న ఎకరాలన్నీ తెగనమ్మి మా అమ్మ మెడలోని పుస్తె సయితం వెచ్చబెట్టి మా నాన్నగారు నాకేదో చక్రవర్తి పదవి అబ్బుతుందని ఇంతవరకూ పెద్ద చదువు చెప్పించారు. కానీ నేను కూటికి కరువుపడి నలుగురిచేతా నగుబాటును పొందుతున్నాను. అభిమానపడి చేయగలిగిందేమీ కనిపించదు. ప్రయత్నలోపమేమయినా చేసానేమో? అంటే ఉద్యోగం కోసం నాకంటే ఎక్కువ ప్రయత్నాలు చేసినవారెవరూ ఉండరని ఘంటాపదంగా చెప్పగలను' అని అతడు తనలో తాను విషాదము పొందుతున్న సమయంలో అన్నపూర్ణ అచ్చమ్మగారింటికెళ్లి శేరు బియ్యమును పమిట చెంగులో మూటగట్టుకొచ్చి-

''ఫర్వాలేదు. ఈ బియ్యం మనకు రెండు మూడు పూటలకయినా సరిపోతాయి. త్వరగా వంట చేస్తాను. మీరు కొంచెంసేపు విశ్రాంతి తీసుకోండి'' అని చెప్పి సంతోషంతో వంట ప్రయత్నంలో దిగింది. వంట చేస్తుంటే నరహరి కూడా భార్య దగ్గర కూర్చున్నాడు.

''అన్నపూర్ణా! ఈ పద్ధతిలో మనం సంసారం ఎంతకాలం సాగించగలం?''

''పోనిస్తురూ! ఏదో ఒకటవుతుంది,. అహర్నిశలు అదే బెంగపెట్టుక్కూర్చుంటే అవుతుందా ఏమిటి?''

''నిజమే అనుకో. రానురాను మన స్థితి మరీ మరీ హీనమైపోతుంది. ఏ కూలి పనికయినా వొడంబడి పావలా డబ్బులయినా సంపాదిద్దామంటే ఆత్మాభిమానం ఒకటి ఏడిపిస్తూంది. ఉద్యోగ ప్రయత్నంలో జీవితమంతా వ్యర్థమైపోతుంది.''

''అందును గురించి మనం తల బ్రద్దలు కొట్టుకుని విచారిస్తే యేం లాభం చెప్పండి?''

''లేదనుకో. నాకేదయినా ఉద్యోగం దొరికేవరకూ నువ్వు మీ అన్నయ్యగారింటి దగ్గరకుపోయి ఉండరాదూ? ఈమధ్య అతడీవూరు వస్తున్నట్లు కూడా ఉత్తరం రాసాడు. వచ్చినప్పుడు నువ్వుకూడా వెడతావా?''

''చాల్లెండి అవేం మాటలు? నాకు కూటికిలేదని తోబుట్టిన వాడి ఇంటికిపోయి వుండనా?''

''కలిగినవాళ్లు మాత్రం అన్నగారింటికి వెళ్లి కొద్దిరోజులుండి రావడం లేదుటే?''

''అది వేరే సంగతి. మనం పచ్చపచ్చగా ఉంటే అన్నగారు పిల్చినా మనం పదిరోజులపాటు ఉండినా మర్యాదగా వుంటుంది. అంతేగానీ, ఈ పరిస్థితిలో వెళ్లినట్లయితే మనం నిజంగా కూటికి లేకనే వెళ్లామనుకుంటారు.''

''ఇహ నీ ఇష్టం మి. నేనింతకంటే ఏం చెప్పను?''

''మీకు చేతిలో కావాల్సినంత విద్య ఉంది. ఉద్యోగం ఈవేళ గాకపోతే రేపు దొరుకుతుంది. నవ్విన వూళ్లే పట్నాలవుతాయి. పడిన గోడలు పడినట్లే ఉండవుకదా.''

''అన్నపూర్ణా! నీ మాటలవల్ల నాకు నూతనోత్సాహం కలుగుతుంది. సడలిపోయిన ధైర్యమంతా తిరిగి కూడుకుంటుంది. ఎటువంటి ఆపదలో నయినా నీవంటి భార్యలు చెప్పే ధైర్య వచనాలవల్ల కొత్త ఆశలు కలుగుతవికదా!''

''మీరేమయినా అనుకోండి. ఇన్నిగాదు, ఇంకో అన్ని కష్టాలు, ఇబ్బందులు, దరిద్రము వచ్చినప్పటికీ నేను మా అన్నయ్యగారింటికి వెళ్లేది లేదు. మన ఇంట్లో మనం మంచినీళ్లు త్రాగి పడుకొన్నప్పటికీ రెండో కంటివాడికి తెలియదు. అయినా లేమి వచ్చింది కదా అని భర్తను విడిచి ఉండడం ఉత్తమ స్త్రీకి ధర్మం కాదు'' అని భర్తకు ధైర్య వచనాలు చెబుతూనే ఓ పావుగంటలో వంట పూర్తి చేసిన అన్నపూర్ణ భర్తకు పెట్టి తాను తింది.

ఆమె చల్లని మాటలవల్ల, చేతలవల్ల నరహరి తన హృదయవేదన అంతటినీ చల్లార్చుకున్నాడు. మర్నాటి విషయమును మరచి ఆనాడు మాత్రమ తను తాత్కాలికానందమునునుభవించాడు.

★★★

''వరుణ్ని చూడ్డం చేతగానప్పుడు కూతుళ్లను కనమని యెవరు చెప్పారండీ మీకు?'' అంది భర్తకు విస్తట్లో అన్నం పెట్టిన రాజమ్మ.

''ఓహో... నీతో గొప్ప చిక్కే వచ్చిందే! వరుడంటే బజార్లో కూరగాయలు కొని తెచ్చినట్లనుకున్నావాయేం? నిన్నెవరు కనమన్నారు ఆ ఆడపిల్లనీ? మానేయలేకపోయావూ?''

''ఇహ చేతగాని కబురు ఇదీ!''

''లేకపోతే యేమిటే? ఆ వరుడు కోసం నేనెన్ని ప్రయత్నాలు చేస్తున్నానో నీకేమైనా తెలుసా? రోజూ విస్తట్లో అన్నం పెట్టి ప్రారంభం చేస్తావు సాధింపు.''

''మీరెన్ని ప్రయత్నాలు చేస్తే ఎవరికి కావాలి? వరుడు కుదిరాడా?''

''అసలు నీకెటువంటి అల్లుడు కావాలో చెప్పు''

''అదేం మాట?''

"అవునే మరి. నీకు కావాల్సిన అన్ని సద్గుణాలు, యోగ్యతలూ ఒక్కరి దగ్గర ఉండవు. చదువుకొన్న వాడికయితే దమ్మిడియెత్తు ఆస్తి ఉండదు. ఆస్తిగలవాడయితే అందమూ, చదువూ ఉండవు."

"నాకేమీ అక్కర్లేదుగానండీ! ఏదయినా ఖాయమయిన నౌఖరీలో వుండి, ఆ ఉద్యోగంవల్ల పదిరూపాయలు సంపాదించుకొంటున్నవాడ యితే చాలు. మనం కట్నాలూ, గిట్నాలూ ఈయలేము కాబట్టి ఇంతకంటే యెక్కువ ఆశలు పెట్టుకుని లాభంలేదు"

"అలా ఒక నిశ్చయానికొచ్చావంటే నిముషంలో నీకు అల్లుణ్ణి తీసుకు రాగలను. మా చెల్లెలిగారి వూళ్లోనే ఉన్నాడు. పాతికేళ్లుంటాయి. మన వాళ్లే. మంచి సాంప్రదాయం. నువ్వు పదిరూపాయల ఉద్యోగమే చాలు నన్నావుగానీ అంతకంటే యెక్కువే సంపాదిస్తున్నాడు."

"ఏమయినా కానీయండి. ఉద్యోగంలోవున్న గౌరవం మరోదాంట్లో లేదు. ఒప్పుకుంటారా?"

"ఒప్పుకు తీరుతాను. నువ్వు చెప్పిందానికి తిరుగుండకూడదు."

"ఏమండీ! అంతా వేళాకోళం"

"వేళాకోళంకాదు. నువ్వు చెప్పిందంతా నిజమే. నాకూ ఉద్యోగం చేస్తున్న అల్లుడే కావాలని ఉంది."

"అయితే తక్షణం ఆ సంబంధమే స్థిరపర్చండి. కట్నమేమీ ఈయనవ సరంలేదుకదా?"

"అవసరంలేదుట. అయినా మన దగ్గరేముందీ కట్నమీయడానికి? వాళ్లు కట్నాలు పుచ్చుకోరుట"

"దివ్యంగా ఉంది. అబ్బాయి ఏమయినా బాగా ఉంటాడా?"

"బాగుండకేం? పాతికేళ్ల పడుచు కుర్రాడు"

"మరయితే మీరోమాటు ఆ వూరు వెళ్లి ఆ సంబంధమును నిశ్చయం చేసుకురండి. ఈ శ్రావణ మాసంలో అయిందనిపించేద్దాం"

"మా చెల్లెలు అన్నపూర్ణను చూడ్డానికావూరు ఓమాటు యెలాగూ వెళ్లాలనుకుంటున్నాను కాబట్టి వెళ్లి ఆ సంబంధమును కూడా చూచి వస్తాను."

"చూచి రావడంకాదు, స్థిరపర్చుకురండి. ఇంకా యెంతకాలం కాల యాపన చేస్తాం? కుర్రదానికి పన్నెండో యేడు కూడా వచ్చేస్తూంది."

"సరే వెడతాగా?"

"అయితే మీ చెల్లెలు మొగుడు నరహరికింకా ఉద్యోగమేదీ దొరకలే దుట."

"లేదు పాపం. చాలా ఇబ్బంది పడుతున్నారుట."

"బిఏ ప్యాసయ్యాడు ఏం లాభం? ఉద్యోగం సంపాదించలేకపో యాడు. అందుకే నేను ఉద్యోగంలో వున్నా అల్లుడు కావాలి మొర్రో అని గోల పెడుతున్నాను."

"నా ఉద్దేశం కూడా అదే. ఆ వరుణ్ణి నిశ్చయం చేసుకుందాము. ఇంతకీ మన అమ్మాయికావరుడు నచ్చుతాడో, నచ్చడో మరి"

"ఏడిసింది దాని ముఖం దానికేం తెలుసు?" అని ఆ భార్యాభర్తలి ద్దరూ మాటలాడుతూ ఉండగా పెళ్లి కూతురు పున్నమ్మ అక్కడికొ చ్చింది.

"ఏమే పున్నీ! నీకెటువంటి మొగుడు కావాలే" అని తండ్రి అడగ్గా-

"ఛీ...పో నాన్నా! వెధవ మొగుడు. నాకసలు మొగుడూ వొద్దు పెళ్లి వద్దు" అని పున్నమ్మ అన్నందువల్ల-

"ఒసి భడవా తప్పే! పెళ్లి వొద్దంటావేమిటీ?" అని రాజమ్మ కూతుర్ని కోప్పడింది.

"పెళ్లి చేసుకొన్నందువల్ల చాలా నష్టాలున్నాయఁర్రా! మీకు తెలీదు. పెళ్లి చేసుకున్నదగ్గర్నుంచి ఆ మొగుడు చేసే అధార్టీలకు అంతుండదు. నానా చాకిరీలు చేయిస్తాడు. ఎవరు చేయగలరు బాబూ!" అని పున్నమ్మ మళ్లీ అంది.

"అఘోరించావుగానీ ఇహ నోరు మూసుకుని వూరుకో. ఎవరయినా వింటే నవ్విపోతారు తప్పకుండాను. రాలుగాలి పిల్ల అంటారు" అంది తల్లి.

"అనుకోనీయండీ. మొగుడిగాడితో నేను బాధలు పడలేను"

"బాధలేముంటాయే. అందరూ పెళ్లిళ్లు చేసుకుని భర్తలతో కాపు రాలు చేయడంలేదూ?"

వాళ్లందరూ బుద్ధిలేనివాళ్లు"

"ఓసి నీ ఇల్లు వల్లకాడుగానూ... నీకెటువంటి పాడు గుణాలు పుట్టి న్నాయే?" అని తల్లి కూతుర్ని తిట్టడం మొదలుపెట్టింది. పిల్లలకు చెప్పే విధంగా నచ్చచెప్పాలని ఆలోచించాడు భగవాన్లు.

"ఒసే పున్నీ! నా మాట విను. అందర భర్తలూ బాధలు పెడితే పెట్టొ చ్చునుగానీ నీకు కాబోయే భర్త మాత్రం అటువంటివాడు కాడు. చాలా మంచివాడు. నువ్వు చెప్పినట్లుగా వింటాడు. అందుచేతనే నీకు పెళ్లి చేయడం"

"నేను చెప్పినట్లు వినే భర్తయితేను చేసుకుంటానఁర్రా!"


"తప్పకుండా వింటాడు. అటువంటి బుద్ధిమంతుడింకెక్కడా ఉండడు. అంచేత నువ్వనవసరమయిన పేచీలేమీ పెట్టకుండా మేము చెప్పినట్లు విని లక్షణంగా పెళ్లి చేసుకో"

అని తండ్రి చెప్పిన మాటలు పున్నమ్మకు కొంతవరకూ నచ్చాయి. అందువల్ల ఆమె పెళ్లి చేసుకోవడానికి అంగీకరించింది.

★★★

పాకీవాళ్లందరకూ మస్తరులు వేయడం పూర్తి చేసాడు అమదాలు. అతని హజమాయిషీలో మొత్తం నూరుమంది పాకీవాళ్లున్నారు. ఒక్కొ క్కడికీ ఆరేసి ఎనిమిదేసి రూపాయల జీతం.

"ఒరేయ్! మీరందరూ జీతాలందుకొన్నప్పుడల్లా ఒక్కొక్కరూ పావలా చొప్పున నాకు బహుమతి ఇస్తూండాలి. లేకపోయినట్లయితే నేనూరుకోను. నాకెవరయితే ప్రతినెలా ఈయరో వాళ్లు సరిగ్గా పని చేయ డంలేదని హెల్తు యినస్పెక్టరుకు రిపోర్టు రాసి పని వూడలాగిస్తాను



విన్నారా? రేపు ఒకటో తారీఖు కాబట్టి గుర్తు పెట్టుకోండి'' అని చెప్పాడు.

"పుచ్చుకోవయ్యా మారాజా! పావలా డబ్బుల్లో మేము చెడిపోతా మాంట?'' అని అందరూ ఒప్పుకున్నారు.

వంద పావలాలు పాతిక రూపాయలు. నా జీతానికి రెట్టింపు ఆదాయం పెరుగుతుంది. పైగా డబ్బు సంపాదించకపోతే పెళ్లికి డబ్బు కూడదు. అమ్మ ప్రతి ఉద్యోగస్తుడూ జీతం డబ్బులతో కూచోకుండా పైగా కొంత డబ్బు సంపాదిస్తాడని చెప్పింది. ఆలోచించగా ఆలోచించగా నాకీ మార్గం కనిపించింది. చాలా బాగుంది. నాకు ప్రతి ఒక్కరూ పావలా ఇవ్వడానికి ఒప్పుకున్నారు ఇహనేం? అని తనలో తను సంతోష పడుతూ ఆమదాలు పాకీవాళ్లందరితోనూ ఏమన్నాడంటే-

"ఒరేయ్! మీలో ప్రతి ఒక్కరూ నాకు అనుకున్న ప్రకారం పావలా ఇస్తున్నట్లయితే నేను ఏ ఒక్కరి మీదా కూడా ఏ విధమైన రిపోర్టును వ్రాయను'' అని ఆమదాలు చెప్పిన మీదట పాకీవాళ్లందరూ ఆ ఏర్పాటు కూడా ఓ విధంగా బాగానే వున్నదనుకున్నారు.

అనంతరం ఎవరి పనుల్లోకి వాళ్లు వెళ్లిపోయారు. ఈ విషయమును తల్లితో చెప్పేవరకు ఆమదాలుకు హృదయముండబట్టలేదు. అందువల్ల త్వరత్వరగా ఇంటికి బయలుదేరాడు.

"అమ్మోయ్ అమ్మా... నా పెళ్లికి డబ్బు కూడబెట్టుకోవాలని చెప్పావుగా?''

"అవును చెప్పాను. పెళ్లెంతలేదన్నా కనీసం రెండొందలయినా ఉండాలి. మన దగ్గర ఆ మాత్రం ఏదిరా?''

"రెండొందలేగాదు, అంతకంటే ఎక్కువ రావడానిక్కూడా నేనొక గొప్ప ప్లాన్ వేసాను.''

"ఏమిటి నాయనా! ఏమిటీ?''

"నా చేతిలో వందమంది పాకీవాళ్లున్నారు. ప్రతినెలా మామూలు ఈయాలని ఆర్డరు వేసాను. అలా అయితే నెలకు పాతిక రూపాయలొస్తాయి. నాలుగునెల్లకీ వంద రూపాయలు. ఎనిమిది నెలలకీ రెండొందలు, పదహారు నెల్లకీ నాలుగొందలు. ముప్పైయి రెండు మాసాలకి ఎంతో చూసుకో''

"బాగుందయ్యా ఈ ఏర్పాటు చాలా బాగుంది. అందుకు పాకీవాళ్లందరూ ఒప్పుకున్నారా మరీ?''

"ఆ.. ఒప్పుకోకపోతే డొక్కలు బద్దలు చేయనూ? ఎవరయితే పావలా ఈయరో వాళ్లమీద రిపోర్టులు రాసి పారేస్తానన్నా''

"నీ తెలివితేటలెంత వృద్ధి పొందాయిరా నా తండ్రీ''

"రేపు ముందు పాతిక రుపాయలొస్తాయి. ఒకటో తారీకుగా పాకీవాళ్లందరూ జీతాలందుకుంటారు.''

ఆధునికాంధ్ర నవలా సాహిత్యానికి చలువ పందిళ్ళు కప్పిన వేయి నవలల నాటి రచయిత శ్రీ కొవ్వలి లక్ష్మీ నరసింహారావుగారి నవలలు (భయంకర్, జయశ్రీ పేరున వున్నవి కూడా) ఎక్కడైనా దొరికితే లేదా మీ వద్ద ఉన్నచో ఈ క్రింది విలాసమునకు తెలుప ప్రార్థన.

కొవ్వలి నాగేశ్వరరావు, కొవ్వలి లక్ష్మీనారాయణ,
19, లక్ష్మీనారాయణ వీధి,
వెస్ట్ మాంబలమ్, చెన్నై-600 033.
ఫోన్: 9840540701, 9866102409

"బాగుంది నాయనా. ఈ లోపుగా ఏదయినా సంబంధం కూడా అదృష్టవశాత్తు వచ్చినట్లయితే శుభకార్యం నిర్విఘ్నంగా జరిగిపోతుంది.''

"జరిగిపోతుందంటావుటే అమ్మా?''

"నీకు జరగకేమిరా వెర్రి తండ్రి? నిక్షేపం అవుతుంది పెళ్లి. జీతమెంతనీ యెవరయినా అడిగినప్పుడు పన్నెండు రూపాయలని మాత్రం ఎప్పుడూ చెప్పొద్దు. ముప్పయి రూపాయలని చెప్పాలి. జ్ఞాపకముంచుకో''

"పాకీవాళ్లిచ్చే మామూలుతో ముప్పయి రూపాయలకు పైగానే వస్తుంది మనకిప్పుడు.''

"అందువల్లనే అలా చెప్పమంటున్నాను.''

"మన ఇంటికెదురుగుండా వున్న నరహరి బిఏ ప్యాసయి రాగి పైసా సంపాదన లేక నిరుద్యోగిగా ఉన్నాడు. అతనికంటే నేనే నయంగాదటే అమ్మా?''

"అందుకింకా సందేహమా? అతనికీ నీకూ పోలికలేదు. నువ్వు నెలకు ముప్పయి రూపాయలు సంపాదించగల ఉద్యోగివి.''

"అటువంటి ఉద్యోగం లేనివాళ్లకే పెళ్లయినప్పుడిక నాలాంటి వాడికెందుకు కాదూ?'' అని ఆ తల్లీకొడుకులిద్దరూ మాటలాడుకుంటూ ఉండగా భగవాన్లు వారింటికొచ్చాడు.

"దయచేయండయ్యా. ఎవరికోసం? తమరెవరూ?'' అని అచ్చమ్మ గారు ఇంటికొచ్చిన పెద్దమనిషినాహ్వానించింది.

"మీ ఇంటికెదురుగా వున్న నరహరి బావమరిదినిలెండి. అన్నపూర్ణ మా చెల్లెలు. మాది గుమ్మలూరు అగ్రహారం.''

"అలాగా! మీ దగ్గర ఆడపిల్లలెవరూ వివాహానికి లేరుకదా?''

"ఉందండి ఒక ఆడపిల్ల. ఆ అమ్మాయికి వివాహం చేయాలనే ప్రయత్నం. మీ అబ్బాయి వివాహానికి ఉన్నాడని విన్నాను'' అని భగవాన్లు చెప్పడమింకా పూర్తి కాకుండానే-

"అవునండీ నేను వివాహం కావాల్సిన వరుణ్ణి. మీ అమ్మాయికెన్నేళ్లు? అందంగా ఉంటుందా?'' అని ఆమదాలు ఆదుర్దాగా అడగడముబట్టి భగవాన్లు కొంచమాశ్చర్యపోయాడు.

"అమ్మాయి బాగానే వుంటుంది. పన్నెండో యేడు. ఈ శ్రావణమాసంలో వివాహం చేయాలని సంకల్పం'' అని భగవాన్లు చెబుతుండగా-

"ముఖ్యంగా అలాగే కానియ్యండి. మాకున్నూ ఎంత తొందరగా అయితే అంత మంచిది'' అని ఆమదాలు అంటుంటే తల్లి అతనివైపొకసారి తీక్షణంగా చూచి-

"నువ్వుండబ్బాయీ! వారితో నేను మాట్లాడతాను'' అంది.

"నా పెళ్లి విషయంలో నేను మాట్లాడకూడదు గాబోలు'' అని సణుక్కుంటూ కూచున్నాడు ఆమదాలు.

★★★

'అన్నపూర్ణా యింటిలోన
అన్నమే కరువాయెగా
లోకమంతా లోభులా?''

అన్న సినిమా పాటను రయ్‌మని పాడుకుంటూ ప్రక్క యింటి పడుచు గిలకమీద బరబర చేదలాగుతూ నూతిలో నీళ్లు తోడుతూంది. ఆ పాట నాలకించిన అన్నపూర్ణ-

"నిజమేనమ్మా నిజమే. ఉన్నమాట అన్నావు. అన్నపూర్ణ ఇంట్లో

అన్నానికి కరువయిన మాట వాస్తవం'' అని తనలో అనుకుని ఒక వేడి నిట్టూర్పును విడిచింది.

'బదులని పట్టుకొచ్చిన సేరుబియ్యమూ యెంతకాలమొస్తాయి? ఇంట్లో చుట్టమొకడు. అన్నయ్యకు మా సంసార స్థితి తెలుస్తే ఎంత చిన్నతనంగా ఉంటుంది? ఎక్కడయినా ఏమయినా సంపాదించుకొస్తాడని ఆయనగారు వెళ్లారు. పన్నెండు కావస్తూంది. అన్నయ్య వచ్చేస్తాడేమో ఇంకా ఎప్పుడు వంట చేస్తాను? ఎప్పుడు పెడతాను? ఈ కాపరం స్థితి అన్నయ్యకు తెలిసిపోతుందో ఏమో? గుమ్మంలోకొస్తే ఒక్క పూట తిండయినా పెట్టలేని దరిద్ర దశలో ఉన్నామనుకుంటాడు కాబోలు...'

అని అన్నపూర్ణ తనలో తాను కించపడుతున్న సమయంలో అలివేణి నీళ్లు తోడుతూ వాళ్ల ఇంట్లోకొచ్చేసింది.

ఇంటివాళ్లకూ అన్నపూర్ణగారికీ నుయ్యి ఒక్కటే. అలివేణి ఆ ఇంటి యజమాని కూతురు. నూతికి నీళ్లకొచ్చినప్పుడల్లా తమ ఇంట్లో అద్దెకున్న అన్నపూర్ణనోమాటు పలుకరించి వెడుతూ వుంటుంది.

తమ సంసార స్థితిని తెలుసుకుని వుండడంవల్లనే అలివేణి నూతి దగ్గర ఆ విధంగా 'అన్నపూర్ణ ఇంటిలోన... అన్నమే కరువాయెగా' అన్న పాటను పాడి వుంటుందని ఆమె రాగానే ముఖమును చిన్నబుచ్చుకుంది.

"ఏమండీ అక్కయ్యగారూ! ఏం చేస్తున్నారు?'' అని ఆమె నోటి నిండా అడిగింది.

"ఏముందమ్మా చేయడానికి? ఏమీలేదు'' అని అన్నపూర్ణ భిన్నురాలై జవాబు చెప్పింది.

"మీవారెక్కడికెళ్లారండీ?''

"వారి కోసమే కూర్చున్నానమ్మా. బజారుకెళ్లి ఇంకా రాలేదు''

"ఇంకా వంట కాలేదా అమ్మా?''

"లేదు. బజారు నుంచి వారు రావాలి.''

"అయ్యో పన్నెండు కావస్తూందండీ. సామాను కోసం కూచున్నారా ఏమిటి? ఏం కావాలి?''

"ఏం కావాలని చెప్పను? అన్నీ కావాలి?''

అని అన్నపూర్ణ చెప్పి చెప్పడంతోనే అలివేణి త్వరత్వరగా తమ ఇంట్లోకి పరుగెత్తుకెళ్లి ఓ చేటనిండా ఇన్ని బియ్యము, పప్పు, నూనె, నెయ్యి, కూరలు, ఉప్పు, చింతపండు, పెరుగు...వగైరాలన్నింటినీ పట్టుకొచ్చి చెప్పింది.

"ఇదేమిటమ్మా... ఇవన్నీ ఎందుకు?'' అని అన్నపూర్ణ వాటినన్నింటినీ చూచి ఆశ్చర్యంగా అడిగింది.

"అబ్బే...ఏమీలేదండీ. నిన్న మా ఇంట్లో సత్యనారాయణ వ్రతం కదండీ. పదిమందినీ భోజనానికి పిల్చుకున్నాము. మీరు మా ఇంటిలో భోజనం చేయరుకదా. అందుకని నిన్ననే మా నాన్నగారీ స్వయంపాకము మీకిచ్చి రమ్మన్నారు. చచ్చుపీనుగను నేనే మరచిపోయాను. తీసుకోండి'' అని చెప్పి అలివేణి ఇహ అక్కడ నిలుచోకుండా వెళ్లిపోయింది.

'భగవంతుడున్నాడనడానికి ఇంతకంటే ఏం నిదర్శనం కావాలి? మా అన్నయ్య వచ్చినందుకూ నా సంసార స్థితి బయట పడకుండా రక్షించబడింది. ఇహ త్వరత్వరగా వంట ప్రయత్నం చేస్తాను'' అని అన్నపూర్ణ సంతోషంతో వంట చేయడానికి లేచింది. అరగంటలో సర్వమూ పూర్తి చేసుకుంది. ఇంతలో భగవానులు వచ్చాడు.

"వంట అయిపోయింది. స్నానానికి లే అన్నయ్యా'' అని అన్నపూర్ణ అనగా-


"బావగారింకా రాలేదూ?''

"లేదన్నయ్యా. వస్తారు. నువ్వు ముందుగా లేచి భోజనం చేయి. ప్రొద్దుపోయింది''

"తొందరలేదమ్మా అతన్ని కూడా రానియ్యి''


"పెళ్లికొడుకును చూసావా అన్నయ్యా?''

"చూసానమ్మా... వ్యవహారమంతా అదోమాదిరిగా ఉంది. మ్యునిసిపాల్టీలో ఉద్యోగంట. ముప్పయి రూపాయలు జీతంట''



## పాపం స్నేహా!

చక్కని నటనతో, చూడచక్కని రూపంతో అందరి అభిమానాన్ని చూరగొన్న స్నేహకు అదృష్టం కలిసిరాక హీరోయిన్ల రేసులో చాలా వెనుకబడిపోయింది. నేటి హీరోయిన్లకు గట్టి పోటీ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో టికినీలో సైతం నటించింది. కానీ స్నేహకు నిరాశే మిగిలింది. చివరకు ఏమనుకుందో ఏమోగానీ ఈమధ్య ఒక మళయాల చిత్రంలో కాలేజీ అమ్మాయికి తల్లిగా నటించడానికి సైతం సిద్ధపడింది. పాపం స్నేహా!



"అంతవరకూ ఉందా?"

"అంతేట! కుర్రాడు చిన్నవాడే. రమారమీ పాతికేళ్లుంటాయి. కట్నం కానుకలిచ్చుకోలేమని స్పష్టంగా చెప్పేసాను. అందుకచ్చమ్మగారు సంతోషంతో అంగీకరించడమే కాకుండా తమకు పిల్ల ప్రధానంగానీ డబ్బు ప్రధానం కాదని స్పష్టంగా చెప్పింది. మనమయినా ఇంతకంటే పెద్ద సంబంధం తీసుకురాలేము చెల్లమ్మ"

"మరయితే స్థిరపర్చలేకపోయావా?"

"ఇక స్థిరపరచినట్టేగానీ కుర్రాడు కొంచెం అమాయకంగా కనిపించాడేమో?"

"అమాయకుడయితే ఉద్యోగమెలా చేస్తున్నాడు."

"నేనూ అలాగే అనుకున్నాను. శ్రావణమాసంలో కానిచ్చేదాం. మీ వొదిన నన్న అహర్నిశలు వేపుకు తినేస్తోంది."

"ఎందుకనీ?"

"ఇంకెందుకూ? పిల్లకు పెళ్లి చేయలేదని. ఈ కాస్త వ్యవహారమూ అయిపోయిందీ అంటే నా బాధ్యత తీరిపోతుంది."

అని వారు మాటలాడుతున్న సమయంలో నరహరి ఇంటికొచ్చాడు. బావమరిదిని చూడగానే తెల్లబోయినాడు.

'లంఖణాల్లో మనుగుణువన్నట్లు ఈ దరిద్ర దశలోనే ఈతను కూడా రావాలా?' అని తనలో తాను కించపడుతుండగా-

"మా అన్నయ్యొచ్చాడండీ. మీకోసం కనిపెట్టుక్కూచున్నాడు. త్వరగా లేవండి భోజనాలు చేదురుగానీ"

అని భార్య అనేటప్పటికి నరహరికి ప్రాణం లేచి వచ్చినట్లయింది.

'నేను తిరిగి తిరిగి రిక్త హస్తాలతో ఇల్లు చేరుకునేటప్పటికి అన్నపూర్ణ సాక్షాత్తూ అన్నపూర్ణగా అవతరించి నా పరువు నిలబెట్టింది కాబోలు' అని తనలో అనుకుని "ఎంతసేపయిందోయ్ భగవానులూ నువ్వొచ్చి?"

"నేను రావడం ఉదయమే వచ్చాను. అచ్చమ్మగారింటికెళ్లి వారబ్బాయిని చూసాను."

"ఏమయిందీ?"

"అవడానికేముందీ? మనం అంతకంటే యెక్కువ సంబంధము తీసుకురాలేము.అందుకని స్థిరపర్చాను. రేపు శ్రావణమాసంలో శుభకార్యం కాస్తా అయిందనిపించేస్తే తీరిపోతుంది."

"ఆ మాటలన్నీ తరువాత చెప్పుకోవచ్చు. ముందుగా భోజనానికి లేవండి."

అని అన్నపూర్ణ తొందర చేయడంవల్ల బావమరుదులిద్దరూ లేచారు. ఆమె వాళ్లకు వడ్డించింది. నరహరి ఆమె గావించిన భోజనం ఏర్పాటు చూసి నిర్ఘాంతపోతున్నాడు.

కూరలు, నెయ్యి, పప్పు, పచ్చడి, పులుసు...అవన్నీ యెక్కడనుంచి వచ్చాయా అని తెల్లబోయాడు. బావమరిది యెదురుగుండా ఆ విషయాలన్నీ అడగడమెందుకని మెదలకుండా వూరుకున్నాడు.

"ఏమోయ్ బావా! మరీ సంబంధం స్థిరపడింది. శ్రావణమాసంలో పెళ్లి. చెల్లాయీ నువ్వూ బయలుదేరిరారూ మరి. యింక ఎక్కువగా వ్యవధి లేదు" అన్నాడు భగవానులు. నరహరి భార్యవైపు చూసాడు.

"ఇప్పటినుంచి ఎందుకులే అన్నయ్యా. ఇంకా పదిహేను రోజుల వ్యవధి ఉందిగా?" అంది అన్నపూర్ణ.

"అదేమిటర్రా! ముఖ్యమైనవాళ్లయినా నాలుగురోజులు ముందుగా రాకపోతే ఎల్లాగు? నాకు మాత్రం ఇంకెవరున్నారు? ఏమోయ్ నరహరి నువ్వు మాట్లాడవేం?"

"నేనేం చెప్పనూ?" అని నరహరి ముభావంగా వూరుకున్నాడు.

★★★

"ఏమండీ! మా అన్నయ్య చాలా పట్టుపడుతున్నాడు. వస్తేగానీ వల్ల కాదంటున్నాడు. ఎలాగ?"

"నీ ఇష్టం. నేనేం చెప్పను?"

"ఇద్దరం వెడదాం వస్తారా మరి? వెళ్లకపోతే వాడూరుకునేటట్లు లేడు."

"ఇక్కడ నేనేదయినా నౌఖరీ ప్రయత్నం చేసుకోకుండా నేను కూడా వచ్చి అక్కడ కూచోడమెందుకు చెప్పు? అలివేణి ధర్మమా అని ఈ రెండురోజులూ మన దరిద్ర స్థితి మీ అన్నకు తెలియకుండా జరిగిపోయాయి."

"మరేసుమండీ! ఈ విషయమే నాకూ చాలా చిత్రంగా ఉంది. స్వయంపాకమంటూ నాలుగురోజులకు సరిపడ్డా బియ్యము, పప్పులు పట్టుకొచ్చి ఇచ్చింది పాపం."

"ఆమె యెప్పుడూ తండ్రిగారింటి దగ్గరే వుంటుందేమో!"

"వితంతువు"

"రామ రామ ఇరవైయేళ్లయినా నిండలేదు"

"భగవంతుడు చేసినదానికి తిరుగేముంటుంది?"

"మనకా స్వయంపాకమివ్వడం దేనికని చెప్పావు?"

"ఆచార్లుగారు సత్యనారాయణ వ్రతం చేసారండీ? వైష్ణవుల ఇంట్లో మనం భోజనం చేయముగదా అని స్వయంపాకమిచ్చారు"

"స్వయంపాకమంటే నాలుగురోజులకు సరిపడ్డా సంబారాలనిచ్చుకుంటారా?"

"ఏమోమరీ. దానికేంగానీ మనం పెళ్లికి వెళ్లడం మాట ఏం తేల్చారూ?"

"నీ యిష్టమన్నపూర్ణా! నేనేం చెప్పను?"

"మీరిక్కడ ఉండి ఉద్యోగ ప్రయత్నం చేసుకోవాలంటారా?"

"లేకపోతే యెట్లా? ప్రయత్నం చేయగా చేయగా ఏదయినా నౌఖరీ దొరుకుతుందేమోనని ఆశ.నువ్వు మళ్లీ వచ్చేటప్పటికి ఏదయినా నౌఖరీ దొరుకుతుందేమో"

"సరే అయితే. వివాహం ఇంకో రెండురోజులుందనగానే మీరు బయలుదేరి రండి. నన్నిప్పుడు అన్నయ్య తీసుకెళ్లడం మానడు."

"సరే అలాగే చెయ్యి"

"తరువాత మీ భోజనమో ఇక్కడ? మరీ ఇబ్బంది పడిపోతారేమో"

"ఏదో చేస్తా"

"చెప్పండి. లేకపోతే నాకసలే మనస్థిమితముండదు"

"స్నేహితులున్నారుగానీ నువ్వు వూరిలో లేవన్న సాకువల్ల అందరి యింటిలోనూ తలో పూట భోజనము చేయవచ్చు. నేనెలాగో కాలక్షేపం చేస్తాలే. ఫరవాలేదు,."

"ఏం కాలక్షేపం చేస్తారో యేమోనండీ. మనకష్టాలిక ఎప్పటికయినా గట్టెక్కుతాయో-యెక్కనే యెక్కవో"

"చూద్దాం"

"మా అన్నయ్య వస్తున్నట్లేవుంది. వూరుకోండి."

ఇంతలో భగవానులు బజారునుంచి కొన్ని బట్టలు వగయిరాలు కొని పట్టించుకొచ్చాడు.

“ఇదంతా పెళ్లి సరంజామా యేమిటన్నయ్యా?”

“అవునే చెల్లమ్మా. మళ్లీ మళ్లీ వస్తానా మరి. అందుకని కావలసినవి చాలా భాగం కొనేసాను. సాయంకాలం ప్రయాణం. నువ్వు సిద్ధంగా ఉన్నావా మరి? ఏమోయ్ బావా నువ్వు?”

“మేము ఇప్పటినుంచీ ఎందుకోయ్?”

“అటువంటి మాటలేవీ ఇక పనికిరావు. అనవసరం గొడవ చెయ్యకండి. ఈపూట మీరిద్దరూ కూడా బయలుదేరవలసిందే”

“మరయితే ప్రస్తుతం మీ చెల్లెల్ని తీసుకెళ్లు”

“నువ్వు?”

“నేను నాలుగురోజులు పోయాక నెమ్మదిగా వస్తా”

“అంతవరకూ ఇక్కడ నువ్వేం ఉద్యోగం చేయాలి?”

ఆ మాటకు నరహరి ఖిన్నుడై వూరుకున్నాడు. తనకేదీ నవుఖరీ లేకపోవడంవల్లగదా బావమరిది అలా హేళనగా మాటలాడుతున్నాడు అని కించపడ్డాడు.

“అందుకనే ఏదో ఒక ఉద్యోగంలోవున్న అల్లుడి కోసం ప్రాకులాడాము. చివరకు మా కోరిక ఫలించింది” అన్నాడు భగవానులు.

“బిఎ ప్యాసయినవారెల్లకాలమూ ఉద్యోగం లేకుండా కూర్చుంటారా ఏమిటన్నయ్యా! ఉద్యోగాలయితే చాలానే వస్తున్నాయి. వారికి నచ్చకపోవడంవల్ల ఇంకా దేనిలోనూ ప్రవేశించలేదు” అని అన్నపూర్ణ భర్తను నిందు చేసుకుంది. ఆమె చెప్పింది కాదనడమెందుకని భగవానులు-

“అలాగే” అని తల వూపాడు.

అనంతరామె భర్తకూ అన్నగారికీ భోజనాలు పెట్టి ప్రయాణానికి సరంజాం చేసుకోవడం మొదలుపెట్టింది. ఒక పూటకయినా అధరవు లేకుండా ఉన్న స్థితిలో భర్తను వొదలాలి. తాను కన్నవారింటి వెడుతున్నందుకామె కెంతయినా కించగా ఉంది. కానీ స్నేహితులు అందరి యిళ్లల్లోనూ తలోపూట కాలక్షేపం చేస్తానని అతడు చెప్పడంవల్ల ఆమె తిరిగి కొంతవరకూ తృప్తిపడింది.

ఆ సాయంకాలం అన్నగారితో ప్రయాణమును సాగించడానికి ఏర్పాటులన్నీ చేయబడ్డాయి. భగవానులు బండి తీసుకురావడానికి అవతలకు వెళ్లిన సమయంలో అన్నపూర్ణ భర్త దగ్గర చేరి-

“ఏమండీ! ఈ స్థితిలో మిమ్మల్ని వొదిలి వెళ్లడానికి నాకెంతమాత్రమూ మనస్కరించడంలేదు. కానీ ఏం చేయను? అన్న పట్టుబట్టాడు. మీరు మాత్రం వివాహమింకో నాలుగయిదు రోజులుండగానే బయలుదేరి వచ్చేయండి. ఆ తరువాత యిద్దరమూ కలిసి అక్కడే పదిరోజులుండి వద్దాం”

“అలాగే. నా గురించి నువ్వేమీ కించపడొద్దు. స్నేహితులున్నారు కాబట్టి ఫరవాలేదు. నువ్వు చెప్పిన ప్రకారం నాలుగురోజులు పెళ్లి ఉందనగానే బయలుదేరి చక్కా వస్తాను.”

“ఈలోపుగా ఉద్యోగం దొరికినా సరే, దొరక్కపోయినాసరే”

“ఆ! అలాగే వస్తా”

ఇంతలో భగవానులు బండి తీసుకువచ్చాడు. అన్నపూర్ణ యొక్క బట్టల మూటను, తాను పెళ్లిని గురించి కొన్న సామానులను అన్నిటినీ బండిలో పెట్టించాడు భగవానులు. అనంతరం ఇంటికి తాళం వేసి నరహరి భార్యను, బావమరిదిని స్టేషనుదాకా సాగనంపడానికి బయలుదేరాడు.

రైలొచ్చేదాకా ఉండి వారిని సామానులతో యెక్కించి భార్య చెప్పిన ప్రతిదానికీ ఊకొట్టి బండి కదిలిన అనంతరం ఇంటికి వచ్చేసాడు. అప్పటికి బాగా చీకటి పడింది.

తలుపు తాళం తీసుకుని లోపల ప్రవేశించాడు. దీపం వెలిగించుకుందామంటే చాలాసేపటివరకూ అగ్గిపెట్టె కనిపించలేదు. తీరా కనిపించిన తరువాత అది ఖాళీపెట్టె అయి ఊరుకుంది. కదిల్చి చూడగా లాంతరులో కూడా చమురు వున్నట్లు కనిపించలేదు.

నరహరి ఒక నిట్టూర్పును విడిచి చాపమీద కూలబడ్డాడు.

***

భార్య మధ్యాహ్నం వండిపెట్టిన అన్నమయితే వుందిగాని అతనికి తినడానికి మనస్కరించలేదు. చీకటి గదిలో అలాగే పడుకున్నాడుగానీ నిద్దర పట్టలేదు.

‘సర్వశూన్యం దరిద్రతః’ డబ్బులేనివాళ్లకీ ప్రపంచంలో యేమీలేదు కదా! అనేకమంది అనేక విధాలుగా డబ్బు సంపాదించుకుంటున్నారు. దారాపుత్రాదులను పోషించుకుంటున్నారు. నా జాతకానికటువంటిదేమీ కనుపించదు.

ఉద్యోగ ప్రయత్నంలో సగం జీవితం గడిచిపోయింది. అక్షరజ్ఞానం లేనివాళ్లు లక్షలు సంపాదించారు. అందుకేం చెప్పాలి? నాది వెధవ జాతకం. తిండికీ, గుడ్డకీ కరువుపడి చావవలసిన బ్రతుకయినప్పుడెంతగా విచారిస్తే మాత్రం ఏం లాభం? అని రాత్రల్లా ఇదే విధంగా తరగని తంపిగా కించపడి కంటికి నిద్దరనేది లేకుండా గడిపాడు.

ఇంట్లో కూచుంటే మతిస్థిమితం మరింత చెడిపోతుందని ఉదయమే లేచి అవశిష్టాలు తీర్చుకుని బయటకి పోవాలని సిద్ధంగా ఉన్న సమయంలో-

“అక్కయ్యగారూ! అక్కయ్యగారూ!” అంటూ అలివేణి చరచర లోపలకొచ్చింది. అన్నపూర్ణ ఎక్కడా కనిపించకపోవడంతో సిగ్గుపడుతూ నరహరి ముఖంలోకి చూచింది.

“ఏమండీ! అన్నపూర్ణ లేదు” అన్నాడు నరహరి.

“ఎక్కడకెళ్లిందండీ?”

“నిన్న వాళ్ల అన్నయ్య వచ్చాడుగా? తీసుకెళ్లాడు”

“ఏమిటీ? అక్కయ్యగారు ఊరుకెళ్లారా? చెప్పనయినా చెప్పలేదు”

“అంతా హడావుడిగా అయిపోయింది. తలవని తలంపుగా ప్రయాణమొచ్చింది. అందువల్ల మీతో చెప్పడం మరచిపోయినట్లుంది. ఏమీ అనుకోకండి. మీరు చేసిన ఉపకారాన్ని మేము జన్మలో మరచిపోము”



"నేను చేసిన ఉపకారమా? ఏమిటబ్బా అది?"

నరహరి పొరపాటున అనేశాడుగానీ ఆమె బియ్యం వగయిరాలిచ్చిన విషయమును తిరిగి చెప్పడానికి అభిమానపడి వూరుకున్నాడు.

అలివేణి అంతటితో వెళ్లిపోలేదు.

"అక్కయ్యగారు తిరిగి యెప్పుడు వస్తారండీ?" అంటూ లోపలికొచ్చింది. నరహరి ఆమె ముఖంలోకి పరిశీలనగా చూసాడు. చిరునవ్వు తప్ప మరేమీ కనిపించలేదు.

"మీ నాన్నగారేం చేస్తున్నారలివేణీ?"

"వారు ఊరిలో లేరు. పొలాలమీదకెళ్లారు శిస్తులు తెచ్చుకోవడానికి"

అందువల్ల ఆమె మనసులో ఏదో ఉద్దేశమును పెట్టుకొచ్చిందనుకుని అతను తనలో అనుకున్నాడు.

"మీయావిడ ఊళ్లోలేదుకదా. మరి ఈ నెలరోజులూ మీరు భోజనం ఎక్కడ చేస్తారు?"

"ఏ హోటల్లోనో"

"ఎందుకండీ! మా ఇంట్లో చేస్తే ఏం తప్పు? మేము మాత్రం బ్రాహ్మలంగామా?"

"ఎంతమాట. ఆదినుంచీ వైష్ణవులకూ స్మార్తులకు భోజనాలు లేవంటారు పెద్దలు"

"ఒక్క బ్రాహ్మల్లోనే ఇన్ని తెగలు, ఇన్ని విభాగాలు ఏమిటండీ?"

"అవును. ఈ పద్ధతి నాకూన్నూ నచ్చలేదు."

"నచ్చలేదని నోటితో అనడంకాదు. క్రియచేసి చూపాలి. మీరు మా ఇంట్లో భోజనం చేసినప్పుడు మీ ఉదారగుణం వెల్లడవుతుంది. ఏమంటారు? చెప్పండి. నేను చేసిందాన్ని మీరు తినరూ?" అని ఆమె ఆదుర్దాగా అడుగుతుంటే అతనేమీ చెప్పలేదు.

"భక్తితో ఎవరు పెట్టినప్పటికీ తినాలి. శ్రీరామచంద్రుడు చూడండీ... భక్తితో పెట్టిందికాబట్టి శబరి యెంగిలి కూడా తిన్నాడు" అని ఆమె చెబుతుంటే నరహరి వింతగా వింటున్నాడు.

'ఆహా! ఈమె మాటలు వినడానికెంత తియ్యగా ఉన్నాయి?' అని తనలో అనుకున్నాడు.

"ఏమండీ! మాట్లాడరేం? నేను చేసినదానిని మీరు తినరా?" అని ఆమె అతనికి దాపుగా వచ్చి తిరిగి అడిగింది. అతను కాదనలేకపోయినాడు.

"తింటానలివేణీ! నువ్వు చేసి పెట్టినదాన్ని తప్పకుండా తింటాను. కానీ ఈ విషయమునెవరికీ తెలియనీయొద్దు"

"ఎవ్వరికీ తెలియనివ్వను. మీయావిడ వచ్చేవరకూ మీరు మా ఇంటిలోనే భోజనం చేస్తుండాలి"

"అంతవరకూనా?"

"ఆ...తప్పదు"

"మరి మీ నాన్నగారొస్తే బాగుంటుందా?"

"మా నాన్నగారు కూడా ఇప్పటిలో రారు. వచ్చినప్పటికీ ఫరవాలేదు. ముందు కాఫీ తాగుదురుగానీ మా ఇంటికి రండి" అని ఆమె నిర్బంధం చేయడంవల్ల నరహరి తలుపులు గెడ వేసుకుని దొడ్లోనుంచి ఆమెతో వాళ్ల ఇంటికి వెళ్లాడు.

ఆమె తనయందంత ఆదర వాత్సల్యాలు చూపడానికి కారణమేమిటా అని అతను దీర్ఘంగా ఆలోచించాడు. తమయొక్క దరిద్ర స్థితిని భార్య వల్ల తెలుసుకుని ఉండడంవల్ల ఆమె అంతగా చేస్తూంది కాబోలునని ఊహించుకున్నాడు.

ఏది ఏమయినప్పటికీ తిండిలేక మాడిపోనవసరం లేకుండా ఒక ఉపాధి ఏర్పడింది కదా అని అతడు తనలో సంతోషపడ్డాడు.

ఇంటిపాలతో అయిదు నిముషాల్లో కాఫీని తయారుచేసి తీసుకొచ్చింది అలివేణి. అతనితోపాటు ఆమె కూడా పుచ్చుకుంది.

అలివేణికి సుమారు ఇరవైయేళ్లు. ఆమె భర్త ముఖమే గాకుండా అంతవరకూ పర పురుషుడి ముఖమెటువంటిదో యెరుగదు. కన్నెప్రాయంలో భర్త గతించినప్పటికీ ఒకరిచేత వేలెట్టి చూపించుకోకుండా ఆమె అంతవరకూ జీవితమను వెళ్లబుచ్చింది.

అనాఘ్రాతం పుష్పం.

నవయౌవ్వనం సౌందర్యం.

హృదయం ప్రేమపూరితం

అంగసౌష్టవం ఆకర్షణీయం

నరహరి తమ ఇంట్లోకి అద్దెకొచ్చినప్పటి నుంచీ ఆమెలో ప్రవేశించిన కోరికలు దినదినమూ వృద్ధి పొందింది. అన్నపూర్ణ ఇంట్లో వున్నంతకాలమూ ఆమె తన హృదయమును విప్పి నరహరితో మాట్లాడ్డానికి సావకాశం చిక్కలేదు. తలవని తలంపుగా చిక్కిన అవకాశమునామె జారవిడుచుకోలేదు. అతను కాఫీ తాగుతుంటే ఆమె కూడా అతనికెదురుగా కూర్చుని కాఫీ తాగుతూంది.

"అలివేణీ! మేమంటే నీకింత ఆదరాభిమానాలెందుకు కుదిరాయి? మొన్నటికి మొన్న మా బావమరిది వచ్చినప్పుడు నాలుగు రోజులకు సరిపోయే సంబారాలిచ్చావుట. ఇప్పుడు తిరిగి మాయావిడ వచ్చేవరకూ భోజనం పెడతానంటున్నావు. కాఫీ ఇచ్చావు."

"ఇవన్నీ చాలా స్వల్ప విషయాలు"

"నాకు చాలా యెక్కువగానే తోస్తున్నాయి"

"ఇంతకంటే ఘనమయినా ప్రేమ హృదయాన్ని మీకు తెలియకుండానే మీ పాదాలకు అంకితం చేసుకున్నాను. దానికేమంటారు?"

అని ఆమె అడిగేటప్పటికికతను తెల్లబోయాడు. ముఖం వెలవెలబోయింది. "మీరు తృణీకరించారంటే నేను అధోలోకంలోకి కృంగిపోతాను. ఎన్నడూ చెలించని నా హృదయం చెలించింది. ఏనాడూ పుట్టని కోరికలు పుట్టాయి. నా బ్రతుకును మీ మూలంగా ఆనందమయం చేసుకోదల్చుకున్నాను. ఈ విషయంలో మీ అన్నపూర్ణకు ద్రోహం జరుగుతూందని మీరే మాత్రం ఆలోచించినప్పటికీ నా ఆశలూ నా కోరికలూ తుత్తునియలైపోతాయి"

అతను జవాబు లేదు.

"మీలో ఏదో సంకోచముంది. ఒద్దు... నిరాకరించకండి. నేను బ్రతకలేను. పుట్టాక నేను పురుష సుఖమెటువంటిదో యెరుగను. అందుకే మిమ్మల్ని ఆశ్రయించాను. నన్ను ఆనందపరచి నా జీవితాన్ని సార్థకం చెయ్యండి" అని పట్టలేని ఉద్రేకంతో ఆమె చెబుతున్న మాటలు విని నరహరి ఒక నిట్టూర్పు విడిచాడు.

'నా దరిద్ర స్థితిని గమనించడంవల్ల ఈమె యింతగా దయ చూస్తుందనుకున్నాను. తిండిలేక నేను మలమల మాడిపోతున్నందుకు తనకు వీలయిన సాయం చేస్తుందనుకున్నాను. నేను తలచినది వేరయింది. ఈమె మనోభావాలు వేరయినాయి. ప్రేమ హృదయం. తృణీకరించడమా? నిరాకరించడమా? ఏమో నాకేమీ తెలియడంలేదు. అంతా అయోమయంగా ఉంది. ఈవిషయమంతా తెలిస్తే అన్నపూర్ణ కించప

డదూ? నిరాకరిస్తే ఆమె హృదయం బ్రద్దలైపోతుందేమో! భగవంతుడీ విషమ పరిస్థితినెందుకు తెచ్చి పెట్టాడో!'

అని నరహరి ఎటూ నిశ్చయం చేసుకోలేని విషమావస్థలో వుండగా-

"నాకు తెలుసు- మీరు సందేహిస్తున్నారు. ఒద్దు- నా పిపాసను గుర్తించండి- నా హృదయక్షోభను తీర్చండి-పాపంలేదు"

అంటూ అలివేణి ఆపుకోలేని ఉద్రేకంతో అతని హృదయం మీద వాలి- చేతులను కంఠానికి పెనవేసింది.

నిరాకరించడానికతడశక్తుడయినాడు. హృదయ దౌర్బల్యమో మరేదో అతని నావరించింది. అతడప్రయత్నంగా ఆమెను దగ్గరగా తీసుకుని, కురులు సవరించాడు.

***

పెళ్ళి మరో మూడు రోజులుండనగానే ఆమదాలు, అచ్చమ్మగారూ తర్లి వెళ్లారు. నరహరి అలివేణులు అంతవరకూ స్వర్గీయానందంలో మునిగి తేలారు. అలివేణి తండ్రి గ్రామాంతరం నుంచి రాకపోవడంవల్ల వారికి సర్వ స్వతంత్రయింది.

అన్నహారాలకు కరువుపడివున్న నరహరి, యింటిపాడితో మనుగుడుపు పెళ్ళికొడుకల్లే గడిపాడా పదిహేనురోజులున్నూ.

రోజుకొక చీర- గంటకొక ముస్తాబుగా అలివేణి, సంవత్సరాలనుంచి తీరకుండా మురిగిపోయివున్న తన కోరికనలన్నింటినీ తీర్చుకొంటూంది. కన్నవారింటికి వెళ్ళాక, అన్నపూర్ణ భర్తయోగ క్షేమమును తెలుసుకొంటూ, రెండు మూడుత్తరాలు రాసింది. తానేలోటు లేకుండా, రోజానికి యిబ్బంది పడకుండా సురక్షితంగానే వున్నట్లు, నరహరి కూడా భార్యకు జవాబుత్తరాలు రాశాడు.

ఆమదాలూ అచ్చమ్మగారూ పెళ్లికి తర్లి వెళ్లారని తెలియగానే, ఇహ తానుకూడా వెళ్లడానికి నిశ్చయం చేసుకున్నాడు నరహరి. ఈ విషయమునే ఆనాడు అలివేణితో ప్రస్తావించాడు.

"రేపయినా వెళ్ళకపోతే బాగుండదు. బావమరిది తప్పుపట్టుకుంటాడు. అన్నపూర్ణ కూడా కోప్పడుతుంది"

"అయితే మీరు పెళ్లికి విధిగా వెళ్ళాలన్నమాట!"

"తప్పదలివేణీ!"

"తిరిగి యెప్పుడొస్తారు?"

"ఏమో మరి?"

"మీరీ పదిహేను రోజుల్నుంచీ నన్ను స్వర్గీయానందంలో తేల్చారు. ఈ ప్రపంచమునే మరచి తన్మయత్వము పొందాను"

"నేను కూడా"

"మీ సంగతి నాకు తెలియదుగాని, సౌఖ్యమంటే యేమిటో- ఆనందమంటే యేమిటో తెలియని నాకు జన్మలో మరచిపోలేని ఆనందరసానుభవం కలిగించారు. ఇంతలోనే వియోగమొస్తుందంటే- మనస్సు వికలమైపోతూవుంది"

"అక్కడ ఎంతకాలముంటాము? కొద్దిరోజుల్లోనే తిరిగి వచ్చేస్తాంగా?"

"మీయావిడనుకూడా తీసుకొస్తారా?"

"అదే ఆలోచించవలసిన విషయం-"

"అలా అంటున్నారేం?"

"మా సంసారపరిస్థితి నీకు తెలియందేమీలేదు అలివేణీ! తిండికీ గుడ్డకీ కరువు పడ్డాముకదా యింతకాలమూను"

"ఇక కరువుపడరులెండి"


"ఏం?"

"మీకు నేనొక యేర్పాటు చేసివుంచాను- మీరిక ఉద్యోగం కోసం ప్రయత్నం చేయొద్దు- ఖర్మంజాలక ఎవరయినా నౌఖరీ యిస్తామన్నప్పటికీ వొద్దని చెప్పండి. మా నాన్నగారికి కూడా తెలియకుండా నా దగ్గర రెండువేల రూపాయలున్నాయి. మీకా డబ్బిస్తాను. దానితో ఒక స్టోర్సు



## డిఫరెంట్ మూవీ

'పోకిరి' చిత్రం చూసినప్పుడు నేను కూడా ఇటువంటి తరహా చిత్రంలో నటిస్తే ఎంత బావుంటుందో అని అనిపించింది. నా కోరిక ఇంత త్వరగా తీరుతుందని ఎన్నడూ అనుకోలేదు. అందరి అభిమానాన్ని విశేషంగా చూరగొంటున్న 'గోలీమార్' చిత్రం నా కెరీర్‌లోనే డిఫరెంట్ మూవీగా భావిస్తున్నాను. పూరీ జగన్నాధ్ నా పాత్రను చాలా చక్కగా తీర్చిదిద్దారు. అంతేకాదు, ప్రేక్షకుల నుంచి కూడా నా పాత్రకు మంచి రెస్పాన్స్ వస్తోంది. థాంక్స్ టు జగన్నాధ్' అంటూ గోపీచంద్ గోలీమార్ విజయంపై తన ఆనందాన్ని వ్యక్తం చేసాడు.



పెట్టండి. క్రమంగా మీరు నెలకు రెండు వందల రూపాయలు కూడా సంపాదించగలుగుతారు. స్వతంత్ర జీవనం చేయొచ్చు''

"స్టోర్సు!''

"అవును- మా అన్నయ్య అయిదు వందల రూపాయలతో స్టోర్సు పెట్టి చాలా గొప్పవాడయినాడు. ఉద్యోగాలకోసం పెద్దచదువులు చదవడము- అందుకోసం ప్రయత్నం చెయ్యడమూ కూడా చాలా పొరబాటు!''

"నువ్వు చెయ్యదల్చుకున్న ఉపకారం చాలా గొప్పది- కానీ యింత చదువు చదువుకొని చిల్లర దుకాణం పెట్టడమా అని...''

"అటువంటి దురభిప్రాయాలను పెట్టుకునే, చాలామంది విద్యార్థులు అడుక్కుంటున్నారు''

"అందుకు కారణమేమిటీ అంటే, ఈపాడు దేశంలో ఉద్యోగమని పిలువబడుతూవున్న సేవకావృత్తికిగల విలువ యితర వృత్తులకు లేకపోవడమేనని నేనిప్పుడు గుర్తించాను''

"అలా గుర్తించినప్పుడయినా యెందుకు కళ్లు తెరవకూడదూ?''

"నిజంగా నీమూలంగా నాకు కొత్త జ్ఞానమంకురించింది అలివేణీ! నువ్వు చెప్పినట్లు చేస్తాను. ఇప్పుడు నువ్వు చేయబోయేది నాకొక మహోపకారం''

"అందుకు ప్రతిఫలం?''

అతను జవాబు చెప్పలేదు.

"అంతకు పదిరెట్లు ప్రతిఫలం యింతకుముందే కలిగింది. కాని నా ప్రేమ పిపాస చల్లారలేదు. నన్ను మీరెప్పుడూ మరచిపోకూడదు''

"కంఠంలో ప్రాణముండగా మరచిపోతానా అలివేణీ! కడుపుకన్నం లేక ఆకలిమంటతో అవురావురమంటున్న స్థితిలో నాకు మృష్టాన్నభోజనములు పెట్టినదాతవు- ద్రవ్య సాయం కూడా చేసి అధోలోకంలోకి కృంగిపోయివున్న నా జీవితరథాన్ని లేవనెత్త పూనుకొన్న ఉదారమూర్తివి- నిన్నెలా మరచిపోగలనూ?''

"రేపు మీయావిడ వచ్చినప్పుడో?''

"అప్పుడు కూడా మరచిపోను''

"మన ప్రేమసంబంధాన్ని తెలుసుకొన్నప్పుడు మీయావిడ సహించుకొంటుందంటావా?''

"ఆమెకు తెలియనీయడమెందుకులే''

"నామీద మీకీ అనురాగం ఎప్పటికీ ఇలాగే వుంటుంది గదూ?''

"ఉంటుందలివేణీ! ఇంతచేసిన నీ విషయంలో నేనవిశ్వాసంగా ప్రవర్తించలేను''

"చాలు. ఒక్క చల్లనిమాట చెప్పారు. నాకదే పదివేలు''

"మరయితే రేపు బయలుదేరి వెళ్లనా పెళ్ళికి?''

"వెళ్లిరండి- బావమరిది కూతురుకు పెళ్లవుతుంటే వెళ్లకపోవడం మర్యాదకాదు. ఊరుకు వెళ్ళేలోపుగా మనమొకసారి బజారుకు వెళ్లి రావాలి''

"మనమిద్దరమూనా?''

"అవును- మనమిద్దరమూనూ-''

"దేనికలివేణీ?'

"మీకు మంచి దుస్తులు లేవు- వాటిని కొనడానికి''

తనయందామెకున్నటువంటి అభిమానమును తెలుసుకొని, నరహరి తనలో తానెంతయినా సంతోషమును పొందాడు.

***

భర్తను చూచేటప్పటికి అన్నపూర్ణ నిలువునా నీరైపోయింది.

సిల్కు దుస్తులు- సేలం కండువాలు- ఒక జమీందారీ బిడ్డలాగున తయారై వచ్చాడతను.

ఆ చిరుగు గుడ్డలేమయినాయో- ఆ మనిషెవరో! అన్నహారాలు లేక శుష్కించిపోయిన వున్న భర్త మీగడతరకలాగా నిగనిగలాడుతూ వుండడము చూచి, ఆమె పట్టలేని ఆనందాశ్చర్యాలననుభవించింది.

అయిదు నిమిషాలవరకూ అతనినేమని పరామర్శించాలో ఆమెకు తెలియలేదు- పదిమందిలోనూ వివరాలనడుగుతే ఏమనుకుంటారోనని, ఆమె అప్పటికి మెదలకుండా వూరుకొని-

అనంతరం-

"ఏమండీ! ఏదయినా ఉద్యోగం దొరికిందా యేమిటీ?''

అని అడిగింది.

నరహరికి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. అలివేణి విషయం చెబుతే ఏం కొంపమునుగుతుందోనని అతడు భయపడ్డాడు. అందువల్ల-

"అబ్బే! అదేమీకాదు- ఒక శ్రీమంతుని స్నేహం లభ్యమయింది. అతనికి నాయందు యెక్కువ దయ యేర్పడడంవల్ల దుస్తులు వగైరాలు కుట్టించాడు. అంతేకాకుండా నాచేత స్టోర్సు పెట్టించడానికి రెండువేల రూపాయలిస్తానన్నాడు''

"చాలా బావుందండీ! మన దరిద్ర దినాలు గడిచిపోయినాయి గాబోలు! అంత ఉదారంగల స్నేహితుడెవరండీ!''

"ఉన్నాడులే- నీకు తెలియదు''

"పోనీలెండి- ఏదోవిధంగా మన యిబ్బందులు గడచి ఒకదారి యేర్పడితే అంతేచాలు- ఇన్నాళ్ళూ భోజనమెక్కడ చేశారు?''

"ఆ స్నేహితుని యింట్లోనే చేశాను. ఎటువంటి లోటూ లేకుండా చాలా గౌరవంగా చూశాడు''

అని భార్యాభర్తలిద్దరూ మాటలాడుకొంటూ వుండగా భగవానులక్కడికొచ్చి-

"ఏమోయ్! ఇన్నాళ్ళదాకా రావడానికి నీకు తీరికలేకపోయిందన్న మాట?''

అని నిష్ఠూరంగా అడిగాడు.

"అవును- నిజంగానే తీరికలేకపోయింది బావా! ఎలాగయినా పెళ్లికి ముందుగానే వచ్చాగాదూ?''

"చాలా గొప్పపని చేశావులే''

అంటూ అతనక్కడనుంచి వెళ్ళిపోయాడు.

"ఏమండీ! మరయితే పెళ్ళి అయిపోయిన వెంటనే మనం మనవూరు వెళ్ళిపోవడమేనా?''

అని అన్నపూర్ణ అడిగింది.

"అదే ఆలోచిస్తున్నాను. పెట్టదలుచుకున్న వ్యాపారమేమవుతుందో...అది స్థిరపడిన తరువాత వెళ్లినట్లయితే బాగుంటుందేమోనని ఆలోచిస్తున్నాను''

"పోనీ అలాగే చెయ్యండి. మా అన్నయ్య వుండమని బలవంతం చేస్తున్నాడు కూడాను- మరో కొంతకాలం నేనిక్కడ వుంటాను. అక్కడ

మీరు సుఖంగా వుంటున్నారు గాబట్టి, నా మనస్సుకిప్పుడు స్థిమితంగానే వుంటుంది''

'నాకేమీ లోటు లేదన్నపూర్ణా! స్నేహితుడు చాలా దయగా చూస్తు న్నాడు. స్టోర్సు పెట్టడమూ- అదీ పూర్తి అయినాక, తిరిగివచ్చి నిన్ను తీసుకెళ్ళడం మంచిదని తోస్తూంది''

"నిజమే- అలాగే చెయ్యండి. వచ్చేటప్పుడు పాపం- అలివేణితో చెప్పడం మరచిపోయానండీ. ఏమనుకుంటుందో యేమో-''

అలివేణి పేరెత్తేటప్పటికతని గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

"ఆఁ! ఏమంటున్నావు?''

"అలివేణి చాలా మంచిది. మా అన్నయ్య వచ్చినప్పుడు కావలసి నన్ని బియ్యమూ వగైరాలిచ్చి మన గుట్టు కాపాడింది. అంత ఉపకారం చేసిన మనిషితో చెప్పకుండా వచ్చేశాను. ఏమనుకుంటుందోయేమో-''

"అదా! ఫరవాలేదు. ఏమీ అనుకోదు''

"మీకెప్పుడైనా కనిపిస్తుందా?''

"ఎప్పుడైనా కనిపిస్తుంది''

"మీరయినా చెప్పండి...తొందరలో ఆమెతో చెప్పడం మరచిపోయా నని''

"చెప్పా- చెప్తాను''

"చెప్పారా?''

"కాదు- చెబుతానీసారి''

అని అతనామెతో ఏమో మాటలాడుతున్నాడుగాని, ఏమాటా మన స్సుకు సమంగాలేదు. భార్యను మోసంచేసి, అన్నీ అబద్ధాలు చెబుతు న్నందుకు అతడు హృదయంలో చాలా బాధపడుతున్నాడు.

"అయ్యో! యింతకాలమూ నా కష్టసుఖాల్లో భాగమును పంచు కొంటూ, కూడుగుడ్డలకు కరువుపడ్డ దుస్థితిలో సయితము నాయందు ప్రేమ వీడకుండా సహనమును వహించియున్న సహధర్మచారిణి విష యంలోనా నేనింత కపటంగా ప్రవర్తించడం?

భగవంతుడు మెచ్చుతాడా? చెప్పేస్తాను- అలివేణికీ నాకూవున్న సంబంధమును ఈమెతో చెప్పేస్తాను. చెబుతే ఏమయినా గొడవవుతుం దేమో-

అని అతడు తనలో తానేమో గొడవ పడుతుండగా-

"ఏమండీ! ఆలోచిస్తున్నారు?''

అని అడిగిందన్నపూర్ణ.

"అబ్బే యేమీలేదు- మన దరిద్రదినాలిప్పటికి గడిచిపోయాయి గదా అని ఆలోచిస్తున్నాను''

"దేనికయినా రోజు రావాలండీ! మనలో ఏముందీ? రోజొచ్చేటప్ప టికి ఎక్కడి కష్టాలక్కడ మంచు విడిపోయినట్లుగా విడిపోతాయి. ఇప్పటి కయినా మన కష్టాలు గట్టెక్కాయి. నాకదే పదివేలు! భగవంతుడా స్నేహి తుడెవర్నో చూపించి తద్వారా మనకు ఉపకారం చెయ సంకల్పించాడు గాబోలు''

అని ఆ యిద్దరూ మాటలాడుతుండగా పెళ్లి కూతురక్కడికొచ్చి..

"ఏమిటే అత్తయ్యా! పెళ్ళి కొడుకు పేరు ఆమదాలుట! అలా వున్నా డేమిటి?'' అంది.

అన్నపూర్ణ మేనకోడల్ని ఒళ్ళోకి తీసుకొని-

"ఎలా వున్నాడే పెళ్ళికొడుకూ? పేరేదయితేయేం? చక్కగా ఉద్యోగం చేస్తున్నాడు- డబ్బు సంపాదిస్తున్నాడు. నీకు కావలసినవన్నీ వస్తూలూ అవీ చేయిస్తాడు'' అని తృప్తిపరచింది.

★★★

"ఏమిటీ! మీ నాన్నగారప్పటినుంచీ రానేలేదూ?''

"లేదుగాని- మీయావిడ యేమందీ? మన విషయం ఏమయినా తెలి సిందా?''

"లేదు- నేనేమీ చెప్పలేదు''

"మీతో తీసుకురాలేదేం మరీ?''

"మరో పదిరోజులపాటు అన్నగారి దగ్గరవుండి వస్తానంది''

"నిజమేనా?''

"నీతో నేనబద్ధం చెబుతానా అలివేణి!''

"మరో పదిరోజులవరకూ మన స్వేచ్ఛగా వుండొచ్చునన్న మాట?''

"అంతవరకూ మీనాన్నగారు కూడా రారా?''

"రానని ఉత్తరం రాశారు. అక్కడేదో పొలం బాగు చేయిస్తున్నారుట. మీ భార్య వచ్చేటప్పటికి, మీరు స్టోర్సు వగైరాలను స్థిరపర్చుకోవాలి- బజారు వీధిలో ఒక కొట్టు ఖాళీ అయిందట. వెంటనే దానిని అద్దెకు తీసు కోండి''

"అలాగే''

"వారింట్లో పెళ్లి లక్షణంగా జరిగిందా?''

"లక్షణంగానే జరిగిందిగాని, పెళ్ళి కూతురుకు వరుడంటే అంతగా యిష్టమున్నట్లు కనబడలేదు''

"ఎన్నేళ్ళుంటాయేమిటి పెళ్లి కూతురుకు?''

"పదమూడు గాబోలు- పెద్ద మనిషయి ఆరుమాసాలయింది. కార్యం కూడా యిప్పుడే''

"ఊఁహూ! అయితే అచ్చమ్మగారి కోడలు వెంటనే కాపరానికొస్తుంద న్నమాట''


"అలాగే అనుకోవచ్చు''

"అచ్చమ్మగారు చాలా అసాధ్యురాలు- కోడల్ని కాపురం చేయని స్తుందో లేదోమరి''

"అలాగా?''

"కొడుకు అమ్మాయకుడుగాని, అచ్చమ్మగారు మహ చెడ్డది- ఊళ్ళో వాళ్లకే తాసికాలూ తంపులూ పెడుతుంది. మొగుడూ పెళ్ళాలకూ- అత్తా కోడళ్ళకూ- నీళ్ళల్లో నిప్పు పుట్టించి- కొంపలంటిస్తూ వుంటుంది''

"అబ్బో! అయితే చాలా కష్టమే!''



"వచ్చే కోడలు కొంచెం తెలివయినదయితే అచ్చమ్మగారి ఆటలు సాగనీయదులెండి"

"ఆ పిల్ల కూడా దేవాంతకురాలే.."

"అయితే ఫరవాలేదు- కథ రక్తికడుతుంది"

"అచ్చమ్మగారంతటిదన్నమాట? ఈ విషయం ముందుగానే తెలుస్తే- పిల్లనీయకుండా చేసేవాళ్ళంగా?"

"ఆఁ! అదంతా మనకెందుకు? ఓసారి మా నాన్నగారికీ నాకూ పెద్ద పేచీ పెట్టాలని చూచింది. అప్పుడు మా నాన్నగారు నాలుగు చెప్పుదెబ్బలు కొట్టారు. అప్పటినుంచీ ఆమె నాతో మాట్లాడదు. అందువల్ల మనకు పోయిందేమీ లేదనుకోండి"

"బాగా చెప్పావు"

"ఈపూట అనవసరంగా ఈ అచ్చమ్మగారి గొడవలో పడ్డామేమిటీ ఖులాసాగా వుండకుండా?"

"సినిమాకు పోదామా!"

"వెధవ సినిమాలో యేముందండీ! పందిరిమంచం మీద హాయిగా పడుకొని, ఆనందతరంగ డోలికల్లో వూగాలిగానీ"

"నీ యిష్టం"

"వంట చేశాను- ఇద్దరమూ ఒకే కంచంలో భోజనం చేయాలీపూట రండీ"

అంటూ అలివేణి నరహరిని చెయ్యి పట్టుకొని వంటయింట్లోకి తీసుకెళ్లింది. ఇద్దరకూ ఒకే కంచంలో వడ్డించింది. భోజనం చెయ్యడానికి ఉపక్రమించారు.

"అబ్బ! తలవని తలంపుగా, జీవితంలో యెటువంటి ఆనందమునను భవిస్తున్నానండి! ఇదంతా మీ అనుగ్రహం, మీ దయ"

"నాయందు నీకటువంటి గాఢానురాగం కుదరడమే గొప్ప విశేషం"

"ఏమయినా అనుకోండి- ఈ వితంతు బ్రతుక్కిక సౌఖ్యమే వుండదని నిరాశ చేసుకున్నాను నా కోరికలను నాలోనే అంతరింపు చేసుకొని, మోడువారిన జీవితాన్ని గడపాలనుకొని, నాలోనే నేను కుళ్ళిపోయే దాన్ని. అటువంటిదిప్పుడు నేనే స్వర్గసౌఖ్యము ననుభవిస్తున్నాను. రేపు మీయావిడొచ్చినట్లయితే, నా ఆశలన్నీ మళ్ళీ నిరాశలవుతాయి గాబోలు"

"నువ్వు మనస్సులో అటువంటి సంకోచము నెప్పుడూ పెట్టుకోవద్దు అలివేణీ!"

"మన ప్రేమ విషయం మీయావిడకు తెలిసినప్పుడేమవుతుంది?"

"అప్పుడు మేమీయింటిలో కాపరముండకూడదు. వేరే మరోయింట వుంటూ- మీ నాన్నగారు లేనప్పుడూ అప్పుడూ నీ దగ్గరకు రహస్యంగా వస్తూపోతూ వుండాలి"

"ఈ ఆలోచన చాలా బాగానేవుందండీ- నిజమే- మీయావిడ వచ్చాకకూడా యిక్కడే వుంటూంటే- ఎప్పటికయినా ప్రమాదం- మానాన్నగారు నెలకు సగం రోజులు గ్రామంలో వుండనే వుండరు- అప్పుడు మనం స్వేచ్ఛగా ఉండొచ్చు"

అని ఆ యిద్దరూ ఆ కబురూ, ఈ కబురూ చెప్పుకుంటూ క్రమంగా భోజనము చెయ్యడం ముగించారు. అనంతరం పడకగది చేరారు.

అలివేణి అగరువత్తులు వెలిగించి- దుస్తులనిండా పరిమళ ద్రవ్యాలను పులుముకొని, నరహరితో పాన్పు చేరింది.

నరహరి మధ్య మధ్య తన్ను గురించి తానే ఆశ్చర్యపోతున్నాడు.

"నా జీవితంలో కలిగిన యీ మార్పుకు నాకే వింతగా వుంది- జన్మలో ఎన్నడూ యెరుగనిదీనాడు నీ ప్రేమవాహినిలో పడి మునిగిపోయాను"

"అందును గురించి విచారిస్తున్నారా?"

"అబ్బే! విచారించడం దేనికి? నన్ను గురించి నాకే ఆశ్చర్యం కలుగుతూంది"

"ఇదంతా నా నోముల ఫలం- నా జీవితానికి పరమావధి- భగవంతుడే నా రసహీనమయిన జీవితాన్ని చూచి కనికరించాడు. మీ ప్రేమహృదయాన్ని ప్రసాదించాడు. తనివితీరా ఆనందము ననుభవించమన్నాడు"

"పోనీ అలాగే అనుకుందాం"

అంటూ అతడు ఆమె అందిస్తూన్న తమలపాకుల మడతలనందుకొంటూన్నాడు. వారీ ప్రపంచమునే మరచి, మరే ఆనందమయ ప్రపంచంలోనో విహారాలు సల్పుతున్నారు.

అయితే క్షణంలో వచ్చేదెవరికి తెలుస్తుంది? నిమిషంలో పడబోయే పిడుగుల సంగతి ఏం తెలుస్తుంది?

ఆ కామినీకాముకులిద్దరూ పందిరి మంచంమీద స్వర్గీయానందము ననుభవిస్తూనే వున్నారు. గంట ఒక నిమిషంగా కాలప్రవాహంలో కొట్టుకొని పోతూనే వుంది.

ఆ విషయం వారికెందుకూ? కాలమానమును తెలుసుకోడానికయినా వారికి సావకాశమెక్కడిదీ?

గోడనున్న గడియారం ఠంగు ఠంగుమని కొట్టిన పన్నెండు గంటల్లోనూ ఒక్కటయినా వారి చెవులలో పడలేదు-

కానీ వీధి తలుపుమీద దబదబ అయిన చప్పుడు మాత్రం ఇద్దరి హృదయాలలో కూడా మారుమ్రోగింది.

ఇద్దరూ తృళ్ళిపడ్డారు- ఇద్దరి శరీరాలూ కంపించాయి- ఎవరి నోటంటా మాటరాలేదు-

"ఏమండీ! మా నాన్నగారు వచ్చేశారు- యిప్పుడెలాగ?"

"మీనాన్నగారే! కొంప మునిగింది-ఏం చేదాం?"

తిరిగి వీధి తలుపుమీద చప్పుడు.

"అమ్మాయీ! అమ్మాయ్! తలుపు-"

"వ్యవధి లేదు- త్వరగా లేవండి- దొడ్డి తలుపుతీసుకుని, మీవాటాలో కెళ్లిపోవాలి మెల్లిగా-"

అని అలివేణి హెచ్చరించడంతోనే, నరహరి వేగిరపడ్డాడు. పందిరి మంచంమీదనుంచి, గబగబలేచి-దొడ్డిగుమ్మంవయిపు పరుగెత్తాడు...అలివేణి కూడా అతని వెనకాలనేవెళ్లి...అతనిని అవతలకు సాగనంపి, తలుపులు వేసుకొని తిరిగి వచ్చేలోపుగా, తలుపుమీద ఏ అయిదారుసార్లో చప్పుడయింది.

అనంతరమామె ఏమీ యెరగనట్లు మెల్లిగా వెళ్లి తలుపు తీసింది. ఆచార్లుగారు లోపలకొచ్చారు.

ఒకవయిపున అగరువత్తులు వెలుగుతున్నాయి, ఇంకోవయిపున సెంటు వాసనలు గుప్పున గుబాళిస్తున్నాయి ఆ శృంగారాట్టహాసాలన్నీ చూచి, అతడు నిలువునా నీరైపోయాడు.

కూతురు ముఖంలోకి చూచాడు. కాని ఆమె తండ్రి ముఖంలోకి చూడలేకపోయింది.

"ఈ శృంగారాట్టహాసాలన్నీ యేమిటమ్మాయ్?"

అని ఆచార్లుగారు కూతుర్ని తీక్షణంగా అడిగాడు.

"ఏముంది, నాన్నగారూ! దోమలు పీకేస్తున్నాయి. అందుకని అగరొత్తులు వెలిగించాను"

"అలాగా?"

"అంతేనాన్నగారూ! ఇంకేమీ లేదు. భోజనం చేస్తారా?"

అని ఆమె లేని ధైర్యమును తెచ్చుకొని తండ్రిగారితో మాటలాడింది.

"నేను భోజనం చేసే వచ్చాను"

"పదిరోజులదాకా రానని ఉత్తరం రాశారు...అప్పుడే వచ్చేశారేం నాన్నగారూ?"

"పొలం మరమ్మతులు చేయించాలనుకున్నాను...కాని వర్షాలెక్కువగా వున్నాయి. అంచేత వీలులేకపోయింది. మరో పదిరోజులు పోయాక చేయిద్దామన్నారు రైతులు"

అని అతడు కూతురుతో ఏమేమో మాటాలాడుతున్నాడేగాని యింటి వరసంతా చూస్తే అతనికి అనుమానాస్పదంగానే కనిపిస్తూంది.

"అన్నపూర్ణమ్మగారు వాళ్లూ పెళ్లికెళ్లి వచ్చారా?"

"ఇంకాలేదు నాన్నగారు!"

"ఆయన కూడా రాలేదా?"

"ఆయన-ఆయన వచ్చారు"

అని కూతురు చెప్పగానే, ఆచార్లుగారు దొడ్డి తలుపులు తీసుకొని, నరహరిగారి వాటావయిపు వెడుతుండడంవల్ల, అలివేణికి గుండెలు వేగంగా కొట్టుకొన్నాయి.

'కొంపతీసి-ఈయన నరహర్నిగానీ-ఏమీ అడగడుగద?'

అని ఆమె తనలో భయపడింది. కాని ఆచార్లుగారంతవరకూ వెళ్లకుండా- దొడ్లో ఓమాటు యిటూ అటూ చూచి, తిరిగి లోపలకొచ్చేశాడు.

అలివేణికి మనస్సు కొంచెం శాంతపడింది.

కూతురుయొక్క ముస్తాబు వయిపు, ఆమె కట్టుకున్న చీరవయిపు అతను వింతగా చూడడం మొదలుపెట్టాడు. అలివేణి ఆ చూపుల్ని లెక్క చేయకుండా, తండ్రిగారికి ప్రక్కనమర్చి-

"పడుకొండి నాన్నగారు" అంది.

"పడుకుంటాలే"

అని అతడు ఒక నిట్టూర్పును విడిచి, ఆమె అమర్చిన ప్రక్కమీద పడుకున్నాడు. అలివేణి తన ప్రక్కమీద తాను పడుకుంది. తండ్రీ కూతుళ్ళిద్దరూ విస్తారంగా మాటలాడుకోలేదు.

ఆచార్లుగారికి మాత్రం మనస్సు స్థిమితంగా లేదు.

'అలివేణి దగ్గర యింతకు ముందెప్పుడూ చెడు గుణాలు చూడలేదు. ఇప్పుడు మాత్రం ఎందుకు కలుగుతాయి? నిజంగా దోమలవల్లనే ఆగరొత్తులు వెలిగించుకుందేమో. అంత మాత్రంలోనే ఎందుకనుమానపడాలి?

కొత్తచీర కట్టుకుంది- తల నిండా పువులు పెట్టుకుంది- దుస్తులనిండా సెంటు వాసనలు విరజిమ్ముతున్నాయి.

వితంతువీవిధంగావుంటే, లోకులు హర్షిస్తారా?

కన్య ప్రాయంలోనే మొగుడు చచ్చాడయ్యో...ఓ చీర కట్టుకోవాలనీ- ఓ పువ్వు పెట్టుకోవాలనీ- ఒకప్పుడు గాకపోతే, ఒకప్పుడయినా కోరిక పుట్టకుండా ఉంటుందా? అంతమాత్రానికి యిహ నేనేమయినా అన్నట్లయితే ఏడుస్తుంది. దీని వితంతు జీవితాన్ని చూస్తే జాలవుతుంది- వేషభాషలు చూస్తే ఒక్కొక్కప్పుడు ఒళ్ళు మండిపోతుంది...ఏం చెయ్యను? కడుపున పుట్టిన బిడ్డ.

తల్లి ఉన్నట్లయితే కూతురుకు చెప్పవలసిన విధంగా చెప్పుకుని అదుపాజ్ఞలో పెట్టుకొని వుండును. కాని అటువంటి యోగం లేదయ్యో. ఏం జేసేదీ?


చుట్టుపక్కల పోకిరీ యువుకులు కూడా యెవరూ లేరుగదా! నా మనస్సింత ఖంగారెందుకు పడాలి? నరహరి చాలా పెద్ద మనిషి. అతని నను మానించకూడదు.

(ముగింపు వచ్చే సంచికలో)



## వెలకట్టలేని అభిమానం!

'హ్యాపీడేస్' విజయం తరువాత తెలుగులో చెప్పుకోదగ్గ హిట్స్ లేక తమన్నా విజయాల రేస్‌లో వెనుకబడిపోయింది. ప్రస్తుతం తమిళ చిత్రాల్లో బిజీబిజీగా ఉన్న ఆమె అక్కడివారి అభిమానాన్ని బాగానే చూరగొంటోంది. 'ఒకసారి అవుట్‌డోర్ షూటింగ్‌కు వెళ్లినప్పుడు అభిమానులు నన్నెంతగానో అభిమానించి అపురూపంగా చూసుకున్నారు. వారి అభిమానం చూస్తుంటే నేను ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో ఈ జన్మలో ఇందరి అభిమానాన్ని చూరగొన్నాను అని అనిపిస్తూ వుంటుంది. వారు నామీద చూపించే అభిమానాన్ని ఇలాగే కాపాడుకుంటాను' అని తన అభిమానుల మీద ప్రశంసల వర్షం కురిపిస్తోంది తమన్నా.



## కొవ్వలి



## కొవ్వలి నవలల్లో కొన్ని...

'కొవ్వలి' అనే పేరు తెలుగు నవలా ప్రపంచంలో ఒక తరం పాఠకులకు చాలా చిరపరిచితం. ముఖ్యంగా మధ్య తరగతి వారిలో పఠనాభిలాషను పెంచిన రచయిత శ్రీ కొవ్వలి లక్ష్మీనరసింహా రావు. అరవైయ్యేళ్ళు నిండేనాటికి వెయ్యి నవలలు రాసిన ప్రతిభ ఆయనది. ఆనాటి పాఠకులనాడి తెలుసుకుని కళాత్మకంగా పాత్రల్ని మలుచుకుంటూ చమత్కారంగా కథని నడిపించేవారు. పెద్దలూ పిల్లలూ, ఆడవాళ్లూ మగవాళ్లూ విరగబడి చదివిన ఈ వెయ్యి నవలల్లో కొన్నింటిని ఆంధ్ర భూమి మాస పత్రిక పాఠకులకోసం ఈ నెలనుంచీ అందిస్తున్నాం.

# 'అలివేణి' జరిగిన కథ

**అచ్చమ్మకి ఒక్కడే కొడుకు ఆమదాలు. అతడికి మున్సిపాల్టీలో పాకీవాళ్ల మీద అజమాయిషీ చేసే ఉద్యోగం. నెలకు పన్నెండు రూపాయలు జీతం. త్వరగా పెళ్లి చేసుకోవాలనే ఆత్రంతో ఉన్న కొడుకుకి సంబంధాలు చూస్తూవుంటుంది అచ్చమ్మ. ఆ ఇంటికి ఎదురింట్లో ఉంటున్న దంపతులు అన్నపూర్ణ, నరహరి. బి.ఏ చదివినా సంపాదన లేక ఉద్యోగం కోసం చెప్పులరిగేలా తిరుగుతూ ఉంటాడు నరహరి. ఇల్లు గడవడం కనాకష్టమైపోతున్నా, సౌశీల్యవంతురాలైన ఆ ఇల్లాలు అన్నపూర్ణ గుట్టుగా ఇల్లు గడుపుకొన్తూ, అంతటి దీనావస్థలో కూడా భర్తకు ధైర్యం చెబుతూ ఉంటుంది.**

**అన్నపూర్ణ అన్నగారైన భగవానులుకి ఒక్కతే కూతురు. ఉద్యోగస్థుడైన వ్యక్తిని అల్లుడిగా చేసుకోవాలని సంబంధాలు చూస్తుంటే, అచ్చమ్మ కొడుకు విషయం తెలుస్తుంది. ఆమదాలుని చూసి ఏకంగా పెళ్లి కుదుర్చుకుని, చెల్లెల్నీ బావగారినీ చూడటానికి వస్తాడు భగవానులు. అన్నగారికి ఒక పూట భోజనం పెట్టడానికి కూడా గతిలేదని అన్నపూర్ణ మథనపడుతున్న సమయంలో వాళ్లకి వంటకి కావలసిన సరుకులన్నీ ఇస్తుంది, పక్కింట్లో ఉంటున్న ఆచార్లుగారి కూతురు అలివేణి. అన్నపూర్ణ ఊరు నుంచి వచ్చేవరకు నరహరిని తమ ఇంట్లో భోజనం చేయమని చెబుతుంది, పక్కింటి ఆచార్లుగారి కూతురు అలివేణి. ఆమె బాల వితంతువు. భర్త ముఖమైనా ఎరుగని తన కోర్కెలు తీర్చమని ప్రాధేయపడుతుంది. కాలం తెలియకుండా ఆమెతో సుఖిస్తూ వచ్చిన నరహరికి తను రెండువేల రూపాయలు ఇస్తానని, దర్జాగా బతకవచ్చని సలహా ఇస్తుంది అలివేణి. పెళ్లికి వెళ్లి ఒక్కడే తిరిగి వచ్చి, తన భార్య కొద్దిరోజుల తర్వాత వస్తుందని ఆమెకి చెబుతాడు. ఆ రాత్రి వాళ్లిద్దరూ సుఖభోగాల్లో తేలిపోతున్న సమయంలో అలివేణి తండ్రి ఊరు నుంచి వస్తాడు. దొడ్డిగుమ్మం తెరిచి నరహరిని పంపించేసి, వీధిగుమ్మం తీస్తుంది ఆమె. ఇంట్లోని వాతావరణం చూసి కూతుర్ని అనుమానిస్తాడు ఆచార్లు.**

**-ఇక చదవండి**

మరేమీ లేదు- ఫలానా ఆచారులుగారి కూతురా అని ఎవయినా వేలెట్టి చూపించినట్లయితే ఎంత అప్రతిష్ఠ? ఎంత అపఖ్యాతి? చెడువాడిక ఏదయినా వచ్చినట్లయితే భరించగలమా?

ఆచార్లుగారిటువంటి ఆలోచనలతో ఆ రాత్రంతా గడిపారు. తెల్లవారేటప్పటి కాయన కాజిజ్ఞాసలేదు. ఆ ఆలోచనాలేదు.

మామూలు వాత్సల్యంతో కూతుర్ని చూసుకుంటున్నాడు. నరహరి కనుపిస్తే అతన్ని కూడా సరిగ్గానే పరామర్శించాడు. అందువల్ల నరహరికీ, అలివేణికీ ఎటువంటి భీతిలేకుండా, మనస్సులకు శాంతియేర్పడింది.

అనంతరం వారంరోజులవరకూ ఆచార్లుగారు ఊళ్ళోనే ఉండడంవల్ల ప్రేయసీ ప్రియులకు ఏమీ సావకాశం చిక్కలేదు. అలివేణి అన్నప్రకారంగా అతనికి సొమ్మునందించింది. నరహరి తన స్టోర్సు ప్రయత్నాన్ని నిర్విఘ్నంగా కొనసాగించాడు.

★ ★ ★

"నాకు పెళ్ళయింది కాబట్టి మీరెవరూ నన్ను 'ఆమదాలు' అని పిలవొద్దు. ఆ పేరు నా భార్యకు నచ్చలేదు" అని ఆమదాలు ఆఫీసు గుమాస్తాతో అన్నాడు.

"మరేమని పిలవాలోయ్?" అని రైటరడిగాడు.

"అవధానులు అని పిలవండి"

"నువ్వు పెళ్లి చేసుకున్నావుగదా! మాకేం బహుమానం చేశావు?"

"మీరే నాకు చెయ్యాలి బహుమానం"

"అటువంటి మాటలు సాగవు. కనీసం ఒక నెల జీతమయినా రయిటరుగారికి బహుమానం చెయ్యి- లేకపోతే ఉద్యోగం ఊడిపోతుంది"

"ఒక నెల జీతమే?"

"మాట్లాడొద్దు- పాకీవాళ్లందరి దగ్గరా పావలా పావలా మామూళ్లు ఏర్పాటు చేసుకున్నావుట. ఈవిషయం ఆఫీసరుగారికి రిపోర్టు చేశానంటే, నీ గతి ఏమవుతుందో ఆలోచించుకో!"

"మీకోనెల జీతం బహుమానమిచ్చుకొంటే, ఏమీ అవదు కాదండీ?"

"ప్రస్తుతం ఏమీ కాదు-"

"అలా అయితే సరే- మీరు కోరిన ప్రకారంగా యిచ్చుకుంటా. మా అమ్మకీ విషయం తెలిసిందంటే చివాట్లు వేస్తుంది"

"తెలియనివ్వకూ!"

"అలాగే చెయ్యాలి. ఒక నెలజీతంతో సరిపెడతారా? మళ్ళీ మళ్ళీ పేచీ పెడతారా?"

"ఆ విషయం తరువాత ఆలోచిద్దాం గానీ-"

"అదిగో- తరువాత మళ్లీ పేచీపెడతారల్లేవుంది"

"ప్రస్తుతం నేను చెప్పినట్లు చేస్తావా, చెయ్యవా?"

"చిత్తం- చిత్తం- చేస్తానండి-"

"ఈవేళ ఒకటో తారీఖుగా? షరాబుదగ్గరకెళ్ళి జీతం పుచ్చుకో. నాకు పట్టుకొచ్చి ఇయ్యి. ఊఁ! తక్షణం-"

అమదాలు హడలిపోతూ షరాబు దగ్గరకెళ్లాడు.

"ఓహోహో! ఆమదాలుగారా? వివాహం చేసుకొని ఎప్పుడో వచ్చారే!"

అన్నాడు నవ్వుతూ షరాబు. ఆముదాలు గుడ్లెర్రజేసి-

"నేను వివాహం చేసుకొచ్చానని తెలిసివుండిన్ని ఆమదాలని పిలుస్తారేమండీ?"

అని అడిగాడు.

"మరేమని పిలవాలి?"

"నా అసలు పేరు అవధాన్లు- మా అమ్మ ముద్దుకు ఆమదాలని పిలుస్తే మీరందరూ అలా పిలవడం ఏమీ బాగుండలేదు"

"సరేగాని భార్య కాపురానికొచ్చిందా యేమిటి?"

"మీ దయవల్ల వచ్చిందండి"

"భేషా! యిహనేం! మరయితే మాకు బహుమతులేవయ్యా!"

"మీకెందుకూ?"

"మా దయగా?"

"ఈనెల జీతమంతా రైటరుగారి కిచ్చుకోవాలి ఉసూరుమంటూ- మీరు నన్నేమీ బాధ పెట్టొద్దు"

"రైటరుగారి కెందుకూ?"

"నేను పాకీవాళ్ల దగ్గర మామూళ్ళు వసూలు చేస్తున్న విషయం ఆయనకు తెలిసిపోయింది. ఒక నెలజీతం తనకీయకపోతే ఆఫీసరుగారికి రిపోర్టు చేసి ఉద్యోగం ఊడ లాగిస్తానన్నాడు. అందుచేత ఒక నెల జీతం దర్శించుకుంటున్నాను"

"ఇది మరీ బాగుంది- రైటరు కంటే నేనే ముందుగా రిపోర్టు చెయ్యాద ల్చుకున్నాను- పాకీవాళ్లను ఏడిపించి నువ్వు చాలా డబ్బు దండుకున్నా వుట- ఆఫీసరుగారికి నా మాటయం దెక్కువ విలువ ఉన్న విషయం నీకు తెలియదు గాబోలు!"

"అయితే యిప్పుడు మీరనేదేమిటండీ?"

"అనవసరంగా నీకూట్లో దుమ్ముపోయడం నాకిష్టం లేదు. ఒక ఏభై రూపాయలు జుల్మానా వేశాను- ఇచ్చుకో"

"ఏభై రూపాయలేః?- ఎక్కడ నుంచి తేనూ?"

"పాకీ వాళ్లదగ్గర వసూలు చేసిందంతా ఏం జేశావు?"

"పెళ్లి కయిపోయింది గదండీ?"

"మరయితే ఎలాగ?"

"ఒక్క నెల జీతం పుచ్చుకుని రక్షించండి. అదయినా వచ్చేనెల జీతం- ఈ జీతం పట్టుకెళ్ళి రైటరుగారికి దర్శించుకోవాలి-"

"నువ్వు మంచి వాడవనే ఉద్దేశంతో నువ్వు చెప్పినట్లు ఒప్పుకుంటు న్నాను- వచ్చే నెల జీతం తప్పకుండా నాకిచ్చేయ్యాలి"

"చిత్తం"

"ఊ! సంతకం చెయ్యి జీతం పట్టుకెళ్ళు..."

అని షరాబు చెప్పిన అనంతరం ఆముదాలు సంతకంచేసి జీతం పుచ్చుకున్నాడు. దానిని పట్టుకుని తిన్నగా రైటరు దగ్గరకు పట్టుకెళ్లి,

"స్వీకరించండి...ఏనాటిదో ఋణం-"

అంటూ సొమ్మునతని చేతుల్లో పెట్టాడు.

"అటువంటి తెలివితక్కువ కబుర్లు చెప్పావంటే నీ రూపాయలు నీ ముఖానికేసి కొడతాను. ఆఫీసరుగారికిప్పుడే రిపోర్టు చేస్తాను"

"చిత్తం- చిత్తం-ఆగ్రహించకండి. మీరొక నెల జీతమును పుచ్చుకొ న్నారని తెలుసుకొని, షరాబుకూడా ఓ నెల జీతమియ్యమని నిక్కచ్చి చేశాడు"

"ఆయన కెవరు చెప్పారు?"

"నేను చెప్పానండి"

"అనుభవించు"

అని రైటరు అతనిచ్చిన రూపాయలు జేబులో వేసుకుని తన గదిలోకి పోయాడు.ఆమదాలు బుర్రగోక్కుంటూ యింటి ముఖం పట్టాడు.

'ఇంతవరకూ అదృష్టవంతుణ్నే- నేను పాకీ వాళ్లందర దగ్గరా పావలా పావలా వసూలు చేస్తున్న విషయం ఆఫీసరుగారికి తెలుస్తే నా నౌఖరీ నిముషంలో ఊడిపోతుంది. అందువల్ల రైటరకూ, షరాబుకూ నోళ్లు కట్టే శాను. చాలా తెలివయినపని.

వివాహమై భార్య కాపరానికొచ్చింగి కూడాను- ఉద్యోగం లేకపోతే యెల్లాగు? నాకు నౌఖరీ పోయింది అంటే, నా పెళ్లాం మరీ మరీ తాటు కులు కట్టేస్తుంది-'

అని తనలో తాననుకొంటూ క్రమంగా యింటివయిపు నడచి పోయినా డామదాలు.


★ ★ ★

ఇంటి గుమ్మంలో కెళ్ళేటప్పటికి మెడలోని 'డవాల్' సంగతి జ్ఞాపకమొ



## దర్శకురాలిగా రంభ!

ఈమధ్యనే పెళ్లి చేసుకుని సినీ వాతావరణానికి దూరంగా వున్న రంభ తిరిగి సినిమాల్లోకి అడుగుపెట్టాలని తహతహలాడుతోంది. కానీ ఈసారి హీరోయిన్‌గా మాత్రం కాదుట... డైరెక్టర్‌గా కొత్త అవతారం ఎత్తాలనుకుం టోందిట. 'నిజమే...నాకు దర్శకత్వం వహించాలన్న కోరిక ఇప్పటిది కాదు, చాలా కాలంగా ఉంది. నటిగా నేనేమిటో నిరూపించుకున్నాను. దర్శకురా లిగా కూడా సక్సెస్ అవుతానన్న నమ్మకం నాకుంది' అని ఎంతో ధీమగా చెబుతోంది రంభ. అయితే మనం త్వరలో రంభని దర్శకురాలిగా చూడ బోతున్నామన్నమాట!



చ్చింది. దానిని భార్య చూచిందంటే-

'నా మొగుడింతా చేస్తే మ్యునిసిపల్ బంట్రోతా?'

అనుకుంటుంది- అనే ఉద్దేశంతో ఆమదాలు మామూలుగా తన డవాల్ తీసి, మణిచి జేబులో పెట్టుకున్నాడు.

"ఏం నాయనా? వచ్చావా?"

అంటూ ఆచ్చుమ్మగా రతన్ని ఆదరంతో ఆహ్వానించింది. పున్నమ్మ లోపలెక్కడో పని చేసుకుంటూ ఉంటుంది.

"ఈవేళ ఒకటో తారీఖు గామోసు జీతం పుచ్చుకున్నావ్రా?"

"ఈవేళ చాలా గొప్పగండం దాటిందే అమ్మా!"

"అదేమిట్రా? అలా అంటున్నావేం? గండమేమొచ్చింది నాయనా?"

"చాలా గొప్ప గండమే అమ్మా! ఈదెబ్బతో నా ఉద్యోగం పోవలసిందేగాని, అదృష్టవశాత్తూ- అనగా నా తెలివి తేటలవలన తిరిగి నిలబడింది"

"అంతవరకూ యెందుకొచ్చింది?"

"ఎందుకొచ్చిందీ అంటే- నేను పాకీ వాళ్ళందరిదగ్గరా పావలా పావలా మామూలు పుచ్చుకుంటున్నా విషయం ఎలా తెలిసిందో రైటరుకు తెలిసింది. వాడు ఆఫీసరుగారికి రిపోర్టు చేసి, నా ఉద్యోగం ఊడలాగిస్తానంటూ కూచున్నాడు. అప్పుడు నేనేం జేశానో తెలుసా? ఈనెల జీతం వాడి ముఖానకొట్టి నోరు నొక్కేశాను-"

"సరి-"

"ఒక నెల జీతంకోసం చూచుకొంటే, ఉద్యోగం వూడిపోదుటే మరీ?"

"అవునులే"

"నేను చేసిన పని బాగుందంటావా? లేదంటావా?"

"బాగానే వుంది-"

అని అచ్చుమ్మ ఒక వేడి నిట్టూర్పును విడిచింది.

"ఇంకా ఒక్క పీడ మాత్రం ఉంది"

"అదేమిటీ?"

"ఇంక షరాబుగాడొకడున్నాడు. వాడి ముఖాన్ని కూడా ఇంకో నెల జీతం కొట్టానంటే, అప్పుడు వాడి పోరు కూడా కట్టడిపోతుంది"

"మళ్ళీ షరాబుగాడెవరూ? వాడు కూడా ఉద్యోగాలు పీకించేవాడేనా యేమిటి?"

"ఉద్యోగాలు పీకించడంలో పేరుబడ్డావాడు- ఆఫీసరుగారికి స్నేహం కూడాను"

"ప్రతి నెలా వచ్చే జీతాన్ని ఒక్కొక్కరికిచ్చేస్తుంటే యెలా?"

"ప్రతి నెలా అక్కర్లేదే అమ్మా! ఈ రెండు నెల్ల జీతమే- లేకపోతే ఉద్యోగం ఎలా నిలబడుతుంది?"

"కోడలు కూడా కాపరానికొచ్చింది. ఉద్యోగం లేకపోతే యెలాగురా నాయనా!"

"అదే నేనూ ఆలోచించాను"

"ఈ సంగతి విన్నావుట్రా?"

"ఏ సంగతేవ్?"

"నరహరిగాడు బి.ఎ. ప్యాసయి నిన్న మొన్నటిదాకా ఉద్యోగం దొరక్క 'అమ్మా బువ్వ- అయ్యా బువ్వ' అన్నాడా? అటువంటివాడు స్టోర్సు పెట్టాడురోయ్! ఎడ తెరిపి లేకుండా వుందిట అమ్మకం- ఒక్కరోజుకే రొండొందలూ, మూడొందలూ వస్తూందిట లాభం"

"అదంతా వుత్తమాటే అమ్మా! స్టోర్సు పెట్టడానికి వాడికి డబ్బెక్కడిదీ? పెట్టినా అంత లాభమెలా వస్తుంది?"

"ఇంకా నయం- వొట్టిదంటావేమిటీ? ఊళ్లో అందరూ చెప్పుకోవడమే గాకుండా నేను స్వయంగా చూశాను. అదృష్టమొచ్చేటప్పటికి, కూటికి లేని వాళ్ళు సయితమూ యిల్లా తయారవుతారు గాబోలు"

ఇంతలో పున్నమ్మ అక్కడికొచ్చి-

"వంటయింది- భోజనాలకు లేవచ్చు-" అంది.

తన జేబులోవున్న డవాల్ ఆమె యెక్కడ చూచి పోతుందో అని అమదాలు దాన్ని గబగబ పట్టుకెళ్లి అలమార్లో దాచేశాడు.

"ఉద్యోగం చేసి వస్తాడు. రోజూ వాడొచ్చేటప్పటికి కాసిన్ని వేడినీళ్ళు స్నానం చేస్తాడు. నీకు తెలియదులే-"

"అయితే సరేలెండి- రేపటినుంటి మీరు చెప్పినట్లే చేస్తా"

అని పున్నమ్మ నవ్వుతూ అంది. ఆమె నవ్వడమును అముదాలు అవతల గదిలోనుంచి చూశాడు.

"అదిగో! నన్ను చూచి నవ్వుతూంది- నా వుద్యోగమంటే హేళనగా వుందన్నమాట. నీ కోడలి వరస ఏమయినా బాగుందిటే అమ్మా!"

అన్నాడు ఏడుపు ముఖం పెట్టి.

"తప్పు పిల్లా! నీ మొగుడు ఉద్యోగానికేం లోటూ? నిక్షేపంలాంటి ఉద్యోగం"

'అయ్యో! నేనందుకు నవ్వలేదండీ!"

"అబద్ధాలు కూడా యెందుకూ? నా ఉద్యోగాన్ని గురించే నవ్వుతున్నావు"

"పోనీ ఇహ నెప్పుడూ నవ్వను లెండి"

అని పున్నమ్మ లోపలకెళ్లిపోయింది.

"నా ఉద్యోగంలో ఒడుదుడుకులొచ్చిన సమాచారం దీనికెలా తెలిసిందంటావమ్మా? రైటరుకు నెలజీతమిచ్చి ఉద్యోగమును నిలబెట్టుకున్నట్లు దీనిక్కూడా తెలిసిందనుకుంటాను"

"అబ్బే! తెలీదురా"

"మరెందుకు నవ్వుతుంది?"

"అందుకుగాదు- మరెందుకో"

"పో! నువ్వు మాత్రం దానికీ గొడవంతా చెప్పకు-"

"నేనెందుకు చెబుతాను? నాకామాత్రం తెలియదనుకున్నావుట్రా వెర్రి నాయనా! పెళ్ళాందానికెప్పుడు లోకువియ్యకూడదు"

"ఆ! అదే నేననేమాటాను. నన్ను ఆమదాలని పిలవ్వద్దని ఆఫీసులో అందరికీ చెప్పేసాను- అవధానులు అని పిలుస్తేగాని పలికేది లేదన్నాను"

"అవధానులుగారూ- అని పిలిస్తేగాని పలకొద్దు-"

"అన్ని పేర్లు ఒకేసారి చెబుతే ఖంగారుపడి చస్తారు. అవధాన్లు అని కొంతకాలం పిలిచాక, అవధాన్లుగారూ అని పిలవాలని చెబుతాను"

"సరే. అలాగేచెయ్యి! ఇంకో విషయం ఏమిటీ అంటే, నీ పెళ్లికి కొంత అప్పు అయింది. పైగా రెండు నెల్లజీతం పైకి పోయింది. కాబట్టి, పాకీ వాళ్ళందర దగ్గరా మరో పావలా అధికంగా పుచ్చుకోవాలి"

"లాభంలేదు- వాళ్లిప్పటికే ఏడుస్తున్నారు"

"పోనీ ఒక్క బేడయినా యెక్కువ చెయ్యి. ఆరణాలవుతుంది"

"ప్రయత్నం చేస్తా- మానను- ఈమన సంభాషణనంతటినీ పున్నమ్మ గాని వినడం లేదుగదా?"

"వినడం లేదు- అది వంటింట్లో అఘోరిస్తూంది"

"అయితే అమ్మోయ్! ఇంకో సంగతి. పున్నమ్మ వాళ్ల అలివేణితో నిన్ననేమిటో గుసగుసలాడుతూ ఉంటే నేను చూశాను. ఆ పోకుదారిపిల్లతో సావాసం చేసిందంటే, పున్నమ్మ ఎందుకూ పనికిరాదు"

"అలాగ(టా! ఈ సంగతి నాకు తెలియనే తెలియదు సుమా! అలివేణి అంటే నాకాదినుంచీ అసహ్యమే. దాని వేషము, వాలకము- పుత్త పోకిరీతనంగా అవుపిస్తుంది. మొగుడు చచ్చినముండ ఎలా వండాలో అది అలా వుండడంలేదు. పున్నమ్మనను పిల్చి అడుగుదాముండు. అలివేణితో యెందుకు గుసగుసలాడుతుందో. యేమే పున్నమ్మా! ఏమే కోడలు పిల్లా- ఓమాటు యిలా రావే, నిన్నే-"

అని అత్తగారు పిలిచిన పిలుపును విని, పున్నమ్మ అక్కడి కొచ్చింది.

"నువ్వు నిన్నటి రోజున అలివేణితో ఏమిటీ గుసగుసలాడుతున్నావుట? లేదని బొంకినందువల్ల ఏమీ ప్రయోజనం లేదు- నీ మొగుడే స్పష్టంగా చూశాడట"

"నేనేమీ గుసగుసలాడ్డం లేదు. రెండు పూటలా వంట నువ్వే చేస్తున్నావా చెల్లెమ్మా, అని అడిగిందావిడ"

"అందుకు నువ్వేమని జవాబు చెప్పావు?"

"నేనే చేస్తున్నానని చెప్పా!"

"ఓసి తెలివి తక్కువ మొద్దూ! అలా యెందుగు చెప్పావే?"

"ఏమండీ చెబుతే- నిజం కూడా అంతేగదా అని చెప్పాను"

"అఘోరించినట్లే వున్నాయి తెలివి తేటలు- నేనో పూట చేస్తున్నానని చెప్పొద్దుటే- లేకపోతే అందరూ ఏమనుకుంటారు?"

"ఏమనకుంటారండీ?"

"నిన్నగాక మొన్న కాపరానికొచ్చిన పిల్ల చేత రెండుపూటలా వంట చేయించుకుని తింటున్నారని, అందరూ నన్నాడిపోసుకుంటారు"

"ఇంతటినుంచీ అలాగే చెబుతాలెండి"

అని పున్నమ్మ అన్న మీదట.

"నువ్వసలా అలివేణితో మాటలాడొద్దు- అది సంగారిదిగాడు"

"వితంతువైయుండి, ఎటువంటి వేషాలు వేస్తూందో చూశావా? ఈసారి నువ్వా వగలాడితో మాట్లాడినట్లు తెలిసిందంటే ఒళ్లు హూనం చేసేస్తా. ఆఁ! తెలిసిందా?"

అని ఆమదాలు పెళ్ళాంతో గుడ్లెర్రజేసి అన్నాడు.

"నాకెందుకండీ నేనెవరితోనూ మాట్లాడను. భోజనాలకు లేవండి- వంటయి చాలాసేపయింది"

అని పున్నమ్మ చెప్పినమీదట, తల్లీ కొడుకులిద్దరూ భోజనానికి లేచారు-

* * *

అన్నపూర్ణ కన్నవారింటి దగ్గరనుంచి అయిదారుత్తరాలు రాసిన తరువాతగాని, నరహరి ఆమెను తీసుకురాలేదు.

ఆమె వచ్చేటప్పటికంతా మార్పు- ఇల్లు మారిపోయింది- ఇంటిలోని సాధన సామగ్రి అంతా మారిపోయింది. భర్తయొక్క వేషభాషలలో మార్పు.

ఈ పరిస్థితులన్నీ చూస్తే ఆమెకొకవైపున ఆనందము- ఇంకోవయిపున ఆశ్చర్యము కలిగాయి.

"ఏమండీ! ఆచార్లుగారిల్లు మార్చేశారేం? దీనికి అద్దెంత? మనకింత పెద్ద యిల్లెందుకండీ?"

"ఉండాలి- దీనికి ఇరవై రూపాయలు అద్దె. వ్యాపారరీత్యా నా గురించే అనేకమంది వస్తూపోతూ ఉంటారు. ఆచార్లుగారిల్లు సరిపోదు- అందుకని బస మార్చాను"

"ఈ పందిరిమంచమెక్కడిదీ? పేము కుర్చీ లెక్కడివి? ఈ బీరువాలు ఈ బల్లలు- ఇవన్నీ యెక్కడివండీ? ఎంత చక్కటి అద్దాలో- ఎవరివీ?"

"పిచ్చిదానిలాగ యీ ప్రశ్నలేమిటీ? అన్నీ మనవే. కొన్నాను. మనమిప్పుడు మునుపటిలాగ బీదవాళ్లంగాదు- శ్రీమంతులలో లెక్కకొస్తాము- స్టోర్సులో మంచి లాభమొస్తూంది. నీకోసం ఎన్ని చీరలు కొన్నానో చూచుకో"

అంటూ అతనొక బీరువాను తెరచి, తానంతకుముందే కొనివుంచిన చీరలను- జాకెట్టు గుడ్డలను భార్యముందు పడేసేటప్పటికామె కళ్లు ఆనందంతో మెరిశాయి.

"అన్నానికే కరువుపడిన మనస్థితి యింతలోనే యిటువంటి అభివృద్ధి లోకొస్తుందనుకోలేదండీ! ఇదంతా నా అదృష్టం- నా నోముల ఫలం- నా కష్టాలు గట్టెక్కాయి గాబోలు"

అంటూ ఆమె పట్టలేని సంతోషంతో ఆ బీరువాలను- భర్తనూ కౌగిలించుకొని మురిసిపోయింది.

"నీకు రెండు మూడు బంగారు ఆభరణాలు కూడా చేయిస్తున్నాను. రేపోయెల్లుండో యిస్తాడు కంసాలి"

"నాకే? బంగారు ఆభరణాలే?"

"ఆఁ! ముందు ముందు మన వ్యాపారం యింకావృద్ధిలోకొస్తుంది"

"భగవంతుడు తల్చుకొంటే ఎంతసేపండీ? రాజును ఫకీరుగా చెయ్యగలడు- ఫకీరును రాజుగా చెయ్యగలు. భగవంతుడు ఘటనా ఘటన సమర్థుడు. మనం కూటికే లేనివాళ్లమనీ, ఎంతమంది ఎన్ని విధాల హీనంగా తూలనాడేవారండీ! రెండు మూడు సార్లు బియ్యం బదులుకెళ్ళానని అచ్చమ్మగారోమాటు ఏమందో తెలుసా?

మీ దరిద్రం వకనాటిదటమ్మా! కావలసినప్పుడల్లా ఎక్కడీయగలం అప్పులూ? అంది.

ఆ విషయం మీతో చెబుతే మీ మనస్సు మరింత కించపడుతుందని చెప్పలేదు"

"అటువంటి వాళ్ళనందర్నీ యిప్పుడెదురుగా రమ్మను- డబ్బుతో కప్పెడుతాము"

"ఎప్పటికయినా నవ్వివ పూళ్ళే పట్నాలవుతాయన్న జ్ఞానం అందరకూ వుండదు"



"అలివేణికూడా యెప్పుడయినా ఏమయినా అనేదా?"

"రామరామ! పాపం మాటలాడుకుంటే పురుగులొడిపోతాను. మన హీనదశ ఆమెకు తెలియనిచ్చేదాన్నిగాను. ఆమె తనంతట తానే పసిగట్టి మనకేంగావాలో కనిపెట్టి చేతులతో పట్టుకొచ్చి గుమ్మరించేది- అటు వంటి దయాగుణం నాకింకెక్కడా కనుపించలేదంటే నమ్మండీ"

"ఆ మాట నిజమే అనుకో- ఆమెయొక్క గుణం మంచిది కాదనుకుంటారు. నిజమేనంటావా?"

"ఛా! ఛా! యెవరంటారండీ! అంతకాలం మనవమాయింటిలో వున్నాము. ఒక్కసారయినా నాకామెదగ్గర దుర్గుణం కనుపించలేదు. ఎవరూ చెప్పుకోగా కూడా నేను వినలేదు"

"నీకేం తెలుస్తుంది. అటువంటిగుణం ఆమె దగ్గర ఉందేమో"

"ఉంటే వుంటుంది పోనిస్తురూ! ఆ గుణం ఒకర్ని బాధించేదికాదు. పట్టుమని చూస్తే ఇరవైయ్యేళ్ళయినా లేవు. చిన్నతనంలోనే మొగుడు పోయాడయ్యే- ఏం జేస్తుందీ? మనిషయిపుట్టాక అనేక కోరికలుంటాయి- అవి యెవర్నీ బాధించవు"

"ఎందుకు బాధించవూ? నువ్వే వున్నావనుకో- నీభర్తనే ఆమె ప్రేమిస్తుందనుకో. అప్పుడు నీకు బాధగా వుండదా?"

అని నరహరి అన్నదానికామె ఒకసారి అతని ముఖంలోకి ఆశ్చర్యంగా చూచి-

"అలివేణి చాలా ఉత్తమురాలు. ఆమె విషయంలో మనమిటువంటి మాటలు చెప్పుకోడం చాలా తప్పు"

"తప్పేగాని, నేనడిగిన దానికి జవాబు చెబుదూ! ఆమెకా గుణముంటే ఎవరినీ బాధించదన్నావుగదా! నీ భర్తనామె ప్రేమించి కాంక్షించినప్పుడు నీకెలా వుంటుందీ?"

"నాకెలాగా వుండదు"

అని ఆమె నవ్వుతూ చెప్పింది.

"ఇలా- నాముఖంలోకి చూచి చెప్పు- ఎలాగావుండదు?"

"ఎలాగావుండదు- అవును. అలివేణి మనకెన్ని ఉపకారాలు చేసిందీ? ఆనాడు మా అన్నయ్య వచ్చినప్పుడు- ఇంట్లో ఏమీలేవు. ఎక్కడియినా వెళ్లి తీసుకొస్తానని బజారుకెళ్లిన మీరెంతకూ రారు. పన్నెండు దాటింది. అప్పుడు గనక అలివేణి మనకు కావలసిన సామానులన్నీ ఈయకపోతే మనమేమైపోదుమూ? మా అన్నయ్యకు మన దరిద్రదశ అంతా వెల్లడయిపోయేదే గదా! అలా ఎన్ని వందలసార్లు మనకు సాయం చేసి, ఆకలి బాధ చల్లార్చిందీ అలివేణి?"

"అదంతా నిజమే. నీ భర్తనామె ప్రేమించినప్పుడు నువ్వు సహిస్తావా?"

"తప్పకుండా సహిస్తాను- ఆమెలోని ఏ కోరికా తీరలేదని, నాకెప్పుడూ జాలిగానే వుండేది. ఓమాటు వాళ్ళ యింటికి పోయిచూచి రావాలి- రేపో యెల్లుండో- నేనంటే ప్రాణమిచ్చేది-"

అని భార్యాభర్తలిద్దరు మాటలాడుకొంటూవుండగా- వారింటికచ్చమ్మగారొచ్చి-

"ఏమమ్మా అన్నపూర్ణా! ఏంజేస్తున్నావూ?" అంది.

"కూర్చోండి!"

"నేను మునుపటి అచ్చమ్మగార్నిగాను ఊరికే కూచోడానికి, మీ మేనగోడల్ని చేసుకున్నాను-గాబట్టి నాకు పీటవేయాలి"

"మన యిద్దరికీ అప్పచెల్లెళ్ళ వరసయింది కాబట్టి, అసలు మర్యాద చేయనక్కర్లేదేమో- అది చూడండీ!"

"ఓహో! ఎత్తుకు పైయెత్తుగాబోలు- ఎప్పుడూ రావడం?"

"ఈపూటనే వచ్చానమ్మా! మా అన్నయ్య యింకా వుండవలసిందని ఎంతో బలవంతం చేశాడు. ఇక్కడ మావారిది కొత్త వ్యాపారము- కొత్త యిల్లు- కొత్త కాపురమూను- అందువల్ల వచ్చేశాను"

"నీ మొగుడుకేమమ్మా! స్టోర్సుపెట్టి, వందలూ వేలూ గుమ్మరించుకొంటున్నాడు-అయితేనూ మీరా ఆచార్లుగారిల్లు మార్చేశారెందుచేతా?"

"ఏమిటో- నేనుంటే మార్చనియ్యను- ఇంకా పెద్ద యిల్లు కావాలంటూ యిందులో దిగారు"

"దీనికి అద్దెంతా?"

"ఇరవై"

"అమ్మనాయనో. ఇరవై రూపయల అద్దే! నాలుగు రూపాయలిచ్చు కోడానికే కటకటపడేవారు. రోజులు మారాయి. ఇరవై అయినా యిచ్చుకుంటారు. అయితే, స్టోర్సు పెట్టుబడీ వగైరాలకంత పెట్టుబడి యెక్కడిదమ్మా?"

"ఎవరో స్నేహితుడిచ్చాడుట!"

"బాగానేవుందిగాని- ఉద్యోగం దొరొస్తుందాయేమిటి? ఎంతకొద్ది జీతమయినా ఉద్యోగం గౌరవంవేరు- బి.ఎ. ప్యాసయి- ఉప్పు మిరపకాయ చింతపండు అమ్ముకోవడమా!"

"నిజమేనండి. అధికారులచేత మొట్టికాయలు తింటూ- బానిస వృత్తి చెయ్యడంకంటే- వ్యాపారంవల్ల స్వతంత్ర జీవనం చెయ్యడం చాలా హీనమైనవని" అన్నాడు నరహరి.

"కోప్పడకబ్బాయి! నాకు తెలిసిన విషయం చెబుతున్నాను. నువ్వు వేలు గణించినా, లక్షలు గణించినా ఉద్యోగం దారి రాదు"

"అవునండీ...మీరు చెప్పింది కాదనడమెందుకూ? నాకు వేరే దారిలేక ఈ వ్యాపారం పెట్టుకున్నాను"

"అలా అన్నావు బావుంది. మా అబ్బాయి చూడండీ! లక్షణంగా ఉద్యోగం చేస్తుంటే, ఎంత గౌరవం? ఎంత పలుకుబడి? వందమంది పాకీ వాళ్ళపైన మావాడు అధికారి!"

అని అచ్చమ్మగారు చెబుతుంటే అన్నపూర్ణ నవ్వాపుకోలేకుండా ఉంది.

"ఈ చీరెలు...ఈ జాకెట్టుగుడ్డలూ- యివన్నీ యేమిటీ? బట్టల వర్తకం కూడానా?"

"అబ్బే! నా స్వంత కోసం కొన్నానండీ!"

"ఏమిటీ? యివన్నీ నువ్వు కట్టుకోడానికే?"

అని అచ్చమ్మగారు దవడలు నొక్కుకోవడం మొదలుపెట్టింది. నరహరి ఆమె మూర్ఖత్వాన్ని తనలో తానే అసహ్యించుకున్నాడు.

* * *

ఆమరునాడు, ఆవేళ ఆదివారం అవడంవల్ల అన్నంతిని మధ్యాహ్నము పూట గుఱ్ఱుపెట్టి నిద్దరోతున్నాడు-ఆమదాలు.

పున్నమ్మ అలమారు సర్దుతూంది. అలమారులో వున్న గుడ్డల్లోనుంచి అమదాలు నిత్యము మెడలో ధరించే 'డవాలు' కిందపడింది. ఆ రేకు బిళ్ళమీద 'మ్యునిసిపల్ ప్యూన్' అని వ్రాయబడి ఉన్నా అక్షరాలను చూచి ఆమె తెల్లబోయింది.

'ఈయనగారు చేసే ఉద్యోగమిదా? ఇంకా యేమిటో అనుకున్నాను. ఈమాత్రం దానికే ఇంత ఆర్భాటం చెయ్యాలా? రోజూ ఆఫీసునుంచి రాగానే భద్రంగా పట్టుకొచ్చి, అలమారులో పెడుతూవుంటే, ఏమిటో అనుకున్నానుగాని, యిదనుకోలేదు. సరిసరి- మ్యునిసిపల్ బంట్రోతు అన్నమాట-

ఉద్యోగం-ఉద్యోగమంటే యింకా యేమిటో అనుకున్నా నేను. ఇన్నాళ్ళకీయనగారి బండారంకాస్తా బయట పడిపోయింది, బాగు బాగు'

అని పున్నమ్మ తనలో తాను ఆశ్చర్యపోయింది. ఆ స్థితికి ఏడవాలనో, నవ్వాలనో కూడా తెలియలేదామెకు.

ఆ డవాలునామె ఎప్పటిలాగున అలమారులో భద్రపరచి యివతలకొచ్చేటప్పటికి అత్తగారు-

"ఏమే పిల్లా! నీ మొగుడు నిద్దరోయి లేచేటప్పటికి కాస్తంత ఏమయినా ఫలహారం చేసి పెట్టరాదూ? ఈవేళ ఆదివారమవడం వల్ల యింటి దగ్గరున్నాడు. లేకపోతే, ఆఫీసు ఉద్యోగంలో ఊపిరె ఆడదుగదా! నీ మొగుడంటే యేమిటనుకున్నావ్? వందమంది పాకీవాళ్ళమీద అధికారి...."

అని అత్తగారు చెబుతుంటే, పున్నమ్మ విరగబడి నవ్వడం మొదలుపెట్టింది.

"అదేమిటే భడవా! అలా నవ్వుతావెందుకూ?"

"ఏమీ లేదత్తయ్యా! మీ అబ్బాయికి ఆఫీసులో ఏమిటా ఉద్యోగం?"

"చెప్పాగా? వందమంది పాకీవాళ్లపై అధికారి"

"ఆ! చాలాపెద్ద ఉద్యోగం సుమండీ! నాకింకా తెలియనేలేదు"

అని ఆమె తిరిగి విరగబడి నవ్వడం మొదలుపెట్టింది.

ఆ నవ్వు మూలాన ఆముదాలు లేచి కూచున్నాడు.

"ఏమిట్రా ఉద్యోగమంటున్నారు?"

"నీకు ఉద్యోగమేమిటో మీయావిడికింకా తెలియలేదు"

అని తల్లి చెప్పగానే, బీరువాలోవున్న తన డవాలును భార్య చూచిందేమోనని అతడు ఖంగారుపడ్డాడు. వెంటనే అలమారు దగ్గరకెళ్ళి, అది యధాస్థానంలో భద్రంగా వుండడమును గమనించాడు. కాని అలమారు తలుపులు తీయబడి వుండడం వల్ల అతనికి అనుమానం కలిగింది.

"ఎవరయినా అలమారు తీశారుట్రా?"

అని అడిగాడు. కాని యెవరూ మాటలాడలేదు.

"ఏమే అమ్మా! అలమారు నువ్వు తీశావా?"

"లేదురా నాయనా!"

"ఏమే పున్నీ- నువ్వు తీశావా యేమిటి?"

"అబ్బే లేదండి!"

అంటూ ఆమె తన నవ్వుకు పైట చెంగునడ్డం పెట్టుకుని చెప్పింది.

"లేదు గదా! మరయితే తలుపులు తీసివున్నాయేం?"

"తీసినప్పుడు తిరిగి వేయడం మీరే మరచిపోయివుంటారు"

"ఆఁహా! సరే అయితే"

అని అతడు తృప్తిపడి, ఈసారి అలమారుకు తాళం కూడా వేసి తల్లి దగ్గరకొచ్చి కూచున్నాడు.

పున్నమ్మ తన నవ్వును తనలో అణుచుకోలేకుండా వుంది.

"నీ మొగుడు లేచేటప్పటికేదయినా ఫలహారం చెయ్యవే అంటే యిందాకటినుంచీ అలాగే యికిలిస్తూ నిలుచున్నావుగాని, కదిలావు కాదు గదా! ఉద్యోగస్తుడయిన మొగుణ్ణీ ఎలా చూడాలో నీకు తెలియదేమో"

అని అత్తగారనేప్పటికీ, పున్నమ్మకు మరింత నవ్వొచ్చింది- ఎదురుగా నవ్వుతే అత్తగారు కోప్పడుతుందని వంటయింట్లోకి పరుగెత్తి పోయింది. అరగంటవరకూ అదే నవ్వు-అదే నవ్వు--

అనంతరం ఫలహారం చేయడానికుపక్రమించింది.


"ఇది ఉత్త పిచ్చిమాలోకంలా వుందేమిరా నాయనా! కారణం లేకుండానే అలా నవ్వుతుందెందుకు?

"ఓసారి వీపు బద్దలు కొడితే నవ్వడం మానుతుందనుకుంటా!"



## గ్లామర్ పాత్రలంటే ఇష్టం

కేవలం గ్లామర్ తరహా పాత్రలకే పరిమితం కాకుండా నటనకు అవకాశమున్న పాత్రలను అద్భుతంగా పోషించి సత్తా అనుష్కకు ఉందని 'అరుంధతి' నిరూపించింది. 'నాకైతే అన్నిరకాల పాత్రలను పోషించాలని వుంది. గ్లామర్ పాత్రలంటే కొంచెం ఎక్కువ ఇష్టపడతాను. అలాగని గ్లామర్ నటిగా ముద్ర వేయించుకోవడం కూడా నాకిష్టంలేదు. అరుంధతిలాంటి పాత్రలు చాలా అరుదుగా వస్తుంటాయి. అలా వచ్చినప్పుడే ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి' అంటోంది.



"నాకూ అలాగే తోస్తుంది. పిల్లని కొంచెం భయభక్తుల్లో వుంచాలిగాని లేకపోతే చెడిపోతుంది"

"అలివేణి సావాసం మానేసిందా లేదా?"

"ఏమో మరి నాకు కనుపించలేదు"

"అలివేణితో యిది మాట్లాడుతున్నట్లు నీగ్గాని యెప్పుడయినా కనుపించిందీ అంటే- వీపు చీరెయ్యవే అమ్మా! నిన్నడ్డుపెట్టేవారెవరూ లేరు"

"నన్నెవరడ్డు పెడతారురా? అలాగే చేస్తాను- ఒరేయ్ అబ్బాయోయ్! నీతో యింకో సంగతి చెప్పడం మరచిపోయారోయ్"

"ఏమిటమ్మా ఏమిటదీ?"

"ఆ నరహరిగాడికి, అన్నపూర్ణకీ యిప్పుడసలు కళ్లే కనుపించడం లేదురోయ్! విన్నావా? వాడి సంపాదన మితిమీరిపోతూంది. లెక్కలేనన్ని చీరలు కొన్నాడు పెళ్ళానికి. ఇంటినిండా యెంత సామానుందనుకొన్నావు? ఇంటద్దె ఇరవై రూపాయలట!"

"అబ్బ!"

"ఇదివరకు దరిద్రంతో వోడిపోతూవుండేవారు- చీటికీ మాటికీ మన యింటికప్పుకోసమొచ్చేవారు- మూడేసి రోజులు వండుకొనే వారుకారా? అటువంటిది వాళ్ళిల్లంతా బంగారమై ఊరుకుంది- వాళ్ళరేఖ బయలుపడింది కాబోలు! ఇప్పుడు మనలాంటివాళ్ళను చూస్తే హేళనగావుంది వాళ్ళకి-"

"మనకేం హాయిగా ఉద్యోగం చేసుకుంటూన్నాం"

"మాటవరసకి చెబుతున్నా. నాలుగు డబ్బులు చేరాయని అంత పొగరా? నేను గుమ్మంలోకెడితే సరిగ్గా మాట్లాడారేగాదు- అన్ని చీరలు, అన్ని గుడ్డలు కొనుక్కున్నారు- మీ కోడలికి పట్టుకెళ్ళండని ఒక్క గుడ్డ ముక్కయినా యిచ్చారుగాదు. వాళ్ళ గుడ్డముక్కలు మనకు కావాలా యేమిటీ?- మాటవరసకు చెబుతున్నాను-"

అని ఆ యిద్దరూ మాటలాడుతుండగా- నరహరి ఆచార్లుగారింటిలో నుంచి రావడమును చూచింది అచ్చమ్మగారు.

"అడుగో! అడుగోరోయ్! అబ్బాయీ! నరహరి- ఆచార్లుగారింట్లో నుంచి వచ్చి- వడివడిగా వెళ్ళిపోతున్నాడు- చూడు! చూడు!"

అని తల్లి చెప్పగానే, ఆమదాలు కూడా చూచాడు.

"అతనిలా ఆచార్లుగారింటికొచ్చి వెడుతుండడమును నేనింతకు ముందు రెండుమూడుసార్లు చూచానే అమ్మా!"

"ఆచార్లుగారు ఊళ్ళో లేనట్టున్నారు"

"ఆయన పది రోజులనుంచీ వూళ్ళో లేడు"

"అయ్యో! అయ్యో! ఎంత సాహసం- అయితే యీ నరహరిగాడు అలివేణి కోసమే వస్తున్నాడన్నమాట. అలివేణిముండ వాడికి అంటుపడింది గాబోలు. ఇప్పుడు దాని పస తీసేస్తానుండు. దాని తండ్రీ, అదీ కలసి- నన్నోమాటు మాటలు మిగలారు. దానిమీద కక్ష తీర్చుకోడానికి నాకిప్పుడు మంచి అవకాశం చిక్కింది"

"అటువంటి వాళ్ళను వొదిలిపెట్టకూడదే అమ్మా!"

"నేనందుకే నీ పెళ్ళాన్ని ఆ లంజతో మాటలాడొద్దంటాను"

"అవునవును- అలివేణి మన పున్నమ్మను కూడ నిముషంలో పాడుజేసేస్తుంది. దానికి గట్టిగా చెప్పి వస్తానుండు"

అంటూ ఆముదాలు గబగబా భార్య వున్న దగ్గరకు పరుగెత్తుకెళ్ళి-

"ఏమేవ్! నీ బుర్రగొరిగించి సున్నంబొట్లు పెట్టిస్తా- గరిటికాల్చి వాతలు పెట్టిస్తా-"

అని కళ్ళెర్రజేసి అంటూ వుంటే పున్నమ్మ తెల్లబోయి-

"ఎందుకండీ! నేనిప్పుడేంజేశా?"

"నిన్ను కోదండం వేయిస్తా- గోడకుర్చీ వేయిస్తా"

"అయ్యో! నా తప్పేముందండీ యిప్పుడు?"

"ఇప్పుడుగాదు- అలివేణి లంజతో మాట్లాడనప్పుడు- అది వొట్టి రంగులాడని తెలిసిపోయింది- మా అమ్మా, నేనూ కళ్ళారా చూశాము"

అని భర్త అంటున్న మాటలువిని-

'ఓయి మీ మూర్ఖత్వం చల్లగావుండా!'

అని తనలో అనుకొని పున్నమ్మ ఒక నిట్టూర్పు విడిచింది.

★ ★ ★

"ఏమంటీ ఆచార్లుగారూ!"

అంటూ, రావడం మెల్లిగానే వచ్చింది అచ్చమ్మగారు. ఆచార్లుగారు వీథరుగుమీద పొడుం నూరుకుంటూ కూర్చుని వుంటారు.

"ఎందుకొచ్చిన బ్రతుకండీ?"

అని ఆమె ఉపోద్ఘాతం ప్రారంభించేటప్పటికాచార్లుగారి కేమీ అర్థంగా లేదు. అతడు పొడుం నూరుకోవడము నాపుజేసి ఆమె వయిపు తీక్షణంగా చూచారు.

"ఆచార్లుగారి వంశమంటే ఎంత పేరుపొందింది? ఎటువంటి ప్రఖ్యాతి గలిగింది? నేను మీ తండ్రిగారినుంచీ కూడా ఎరుగుదును. ఎన్నడయినా వేలెట్టి చూపించుకున్న వంశమండీ!"

ఆ పొగడ్తలన్నీ యెందుకో అతనికి తెలియడం లేదు.

'ఈ పేచీకోరు ముండ ఎందుకొచ్చింది చెప్మా! కొంపమీదకెప్పుడూ ఏదో ఒక గందరగోళం తెస్తుంది- ఇది వరకో మాటు చెప్పుదెబ్బలు కొట్టాను. ఆరుమాసాలవరకూ గుమ్మమెక్కలేదు- ఇప్పుడు మళ్ళీ యేదో తవ్వాయి పట్టికొచ్చింది గాబోలు"

అని తనలో అనుకొని, ఆచార్లుగారు-

"ఇప్పుడింతకూ నువ్వు చెప్పబోయేదేమిటమ్మా?"

"నేనేం చెప్పినా మీమంచికోసం చెబుతాగాని, కక్షకోసం అనుకోకు నాయనా! ఆమధ్యనిలాగే ఏదో చెప్పబోతే, చెప్పుదెబ్బలు కొట్టావు. అయినప్పటికీ యీ ఘోరాన్ని కడుపులో యిముడ్చుకోలేక అయిన వంశం చెడిపోతూండడమును కళ్ళారా చూచి సహించుకోలేక- దుగ్ధకొద్దీ వచ్చాను"

"అసలు కథేమిటో రానియ్యవమ్మా!"

"నేను మరో దురుద్దేశంతో చెబుతున్నాననుకోకు నాయనా! నా కూతురెటువంటిదో మీ అలివేణి నాకటువంటిది. నేను గనక దానిమీద లేనిపోని మాటలు కల్పించి చెప్పానంటే నశించిపోతాను"

"సరే- కానియ్యి"

"వాడు నాకు అయిన బంధువే- వాడి బావమరిది కూతుర్ని నా కొడుక్కు చేసుకున్నాను. అయితే మాత్రం- నోటితో ఉచ్చరించరాని ఘోరాన్ని కళ్ళారాచూచి ఎలా సహించుకుంటాను- తల్లిపాలు తాగి రొమ్ము గుద్దినట్టు- ఆ దుర్మార్గుడు మీయింట్లో కాపరముండి- మీకన్నే పొడిచాడు- చిత్తగించారా?"

"ఏమిటమ్మా నీ గొడవ- ఎవరువాడు?"

"ఇంకెవరూ? మీ యింట్లో యింతకాలమూ కాపరముండి లేచిపో

యిన ఆ నరహరిగాడు''

"ఊ! ఏం చేశాడూ?''

"ఇంకా యేంచెయ్యాలి? మీరు గ్రామంలో లేనప్పుడు మీ యింట్లో ప్రవేశిస్తున్నాడు. నేనూ, నా కొడుకూ వందమాట్లు చూచాము''

"అతను మా యింటికి రావడం దేనికీ?''

"అయ్యయ్యో! ఆడముండాకూతుర్ని- ఇంకా యేమని విప్పి చెప్పనూ? మీ అలివేణి వాడిని మరిగిందోయ్ మహారాజా! ఇప్పుడయినా కళ్లు తెరచి చూచుకొండి''

అని ఆమె చెప్పేటప్పటికి అయిదు నిముషాలవరకూ నిర్ఘాంతపోయి కొయ్యలా అయిపోయినాడాచార్లు- అనంతరం తనలో యేమనుకున్నాడో-

"ఓయ్! యింతా చేస్తే యిదటమ్మా కబురూ! ఊరుకు వెళ్ళేటప్పుడు నేనే నరహరితో చెప్పాను. అప్పుడప్పుడూ మా యింటికొచ్చి, అమ్మాయిని చూచి పోతూవుండవలసిందనిన్నీ- అతడు కొంతకాలం మాయింట్లో కాపరమున్నా కారణం వల్లనూ- అతని మంచిచెడ్డలు తెలిసినవాణ్ణవడంవల్లా అలా చెప్పాను- ఈ అవకాశాన్ని పురస్కరించుకుని నువ్వు రంకులు కడుతున్నావుటమ్మా! ఇదివరకోసారి నీకు బుద్ధి చెప్పాను- ఈసారికూడా క్షమిస్తున్నాను. మళ్లీ యెప్పుడయినా మా గొడవ యెక్కడయినా ఎత్తినట్లు తెలిసిందంటే- తప్పకుండా నీ బుర్ర బద్దలుకొడతా- తెలిసిందా? నడునడు. తక్షణం మా గుమ్మంలోనుంచి అవతలకు నడు''

అంటూ ఆచార్లుగారు మహోగ్రుడై పొడుంనూరే కర్రనెత్తేటప్పటికి-

"అయ్యో! అయ్యో! ముండా ప్రపంచం! కూతురు రంకును ఎలా కప్పుకుంటున్నాడ్రా!''

అని సణుక్కుంటూ, అచ్చమ్మగారక్కడ నిలుచోకుండా చక్కాపోయింది.

అనంతరం ఆచార్లుగారు లోపలకెళ్లి, వీధి తలుపు గడియవేశాడు. తిన్నగా కూతురున్న గదిలోకెళ్లాడు. ఆమె అంతకుముందే అచ్చమ్మగారన్నమాటలన్నింటినీ స్వయంగా విని వుండడం వల్ల తండ్రిగారొచ్చేటప్పటికి, వెక్కి వెక్కి ఏడుస్తూ మంచానికడ్డంగా పడుకుని వుంది.

"ఏమిటి తల్లీ! ఎందుకలా ఏడుస్తావు? అచ్చమ్మగారలా అందనా?''

అని అతడు కూతుర్ని వాత్సల్యంగా అడిగాడు.

"ఆడబ్రతుకు, అందులోనూ వెధవరాలై బ్రతకడమంత నీచం యింకోటి లేదు''

అని మరింత మరింత వెక్కి వెక్కి యేడుస్తున్న కూతుర్ని తిలకించి-

"నువ్వెందుకమ్మా అనవసరంగా ఏడుస్తావు? ఆ అచ్చమ్మ ముండ మాటలు నేను విన్నాను గనుకనా?''

అని బుజ్జగించాడు.

"నమ్మితేయెందుకు? నమ్మకపోతే యెందుకు నాన్నా! నావంటి అభాగ్యురాలు బ్రతకడం చాలా అనవసరం- పుట్టిన తరువాత నేననుభవించిందేముందీ? నాలోపుట్టి, నాలో పెరిగిన కోరికలు నాలోనే అంతరించాలి గదా? నా యౌవన సౌందర్యాల నీ సంఘానికి బలిదానమీయవలసిందే గాని వేరు కర్తవ్యంలేదు గదా! నేనెందుకు బ్రతకాలి? ఎవరికోసం''

అని అలివేణి తండ్రి ఒడిలోపడి కుమిలి కుమిలి యేడుస్తూ-

"ఇలాగయినప్పటికీ నా దినాలు గడవడం లేదు. ఎవరో ఒకరు ఏదో ఒకమాట అంటూ వుంటారు. అంతేగాని నా హృదయవేదనను గమనించిన వారొక్కరూ లేరు. నా కన్నతండ్రికీ నా హృదయతాపం గుర్తించవలసిన అవసరం లేనప్పుడితరులకేంగావాలి?''

అని ఆమె తిరిగి యేడవడం మొదలుపెట్టింది.

కూతురలా విలపించడమునా తండ్రి అంతకుముందెప్పుడూ చూడలేదు. ఆ బిడ్డకయిదోయేట తల్లిపోతే...అతడే ఆమెను అల్లారు ముద్దుగా పెంచుకొన్నాడు. విద్యాబుద్ధులు చెప్పించుకొన్నాడు. అయిదారువేలు ఖర్చుపెట్టి వివాహం కూడా చేశాడు. కాని ఆమె అక్కరకు లేదు.

అందుకతడు లోలోపల ఎంతగా కుళ్ళి యేడుస్తున్నాడో ఎవరికి తెలుసు.

"తల్లీ! నువ్వు చెప్పిందంతా నిజం- నీ సౌందర్యయౌవ్వనాలను నీ కోరికలను- ఈ సంఘానికి బలిదానమిచ్చాను- మనం జడిసినకొద్దీ- ఈ లోకం మనల్ని బెదిరిస్తుంది''

అని కూతుర్ని బుజ్జగిస్తూ అతడు తనలో తానెందును గురించో దీర్ఘాలోచన చేయడం మొదలుపెట్టాడు.

అలివేణి తండ్రి ముఖంలోకి ఆశతో చూస్తూంది.

"తెలిసింది తల్లీ! నాకిప్పుడు కర్తవ్యమేమిటో తెలిసింది. నీ యేడుపును నేను చూడలేను. ఊరుకో, నీ జీవితాన్నిక వ్యర్థం చెయ్యను. నీ హృదయానికి ఏవిధంగా ఆనందం కలుగుతుందంటే- అలా చెయ్యడానికి నేనెంతమాత్రమూ వెనుతీయను. అచ్చమ్మగారివంటి లోకుల్ని లెక్కజేసి నీ జీవితానందమును పాడు చెయ్యను- పాడు చెయ్యను తల్లీ! ఇక నీ జీవితానందాన్ని పాడు చెయ్యను''

అని ఆచార్లుగారు కృతనిశ్చయంతో అన్నమాటల కలివేణి తెల్లబోయింది. ఆమె హృదయంలో తిరిగి ఆశారేఖలుద్భవించాయి.


"నాన్నా! నీ మాటలవల్ల నాకెందుకో విచారమంతాపోయి ఆనందం కలుగుతూంది. అయితే, యివి తాత్కాలికంగా నా హృదయతాపాన్ని చల్లార్చడానికి చెప్పే మాటలా? లేక నిజంగా నా బ్రతుకునానందమయం చెయ్యడానికి చెప్పే మాటలా?''

"భగవంతుడి సాక్షిగా, నీ జీవితాన్ని ఆనందమయం చెయ్యడానికి చెప్పే మాటలేతల్లీ యివి''

అని తండ్రిగారు తిరిగి చెప్పినందువల్ల, అలివేణికప్పటికప్పుడే కొంత శాంతి కలిగింది.

* * *

తండ్రిగారొచ్చి రావడంతోనే ముందుగా పున్నమ్మ యెదురయింది.



"వచ్చావా నాన్నా!"

"ఎందుకు రాను తల్లీ! నువ్వు అర్జంటుగా రావలసిందని ఉత్తరం రాశావుగా?"

"రాశానుగానీ- నేనలా మీకు ఉత్తరం రాసినట్లుగా ఎవరికీ చెప్పొద్దు- మామూలుగా వూరికే చూడ్డానికి వచ్చినట్లుగా నటించండి. వివరాలన్నీ తరువాత చెబుతా! ఈ యింటిలో వాళ్ళెవరూ మిమ్మల్నింకా చూడలేదుగా?"

"లేదు"

"అదిగో! దొడ్లోనుంచి అత్తగారొస్తూంది- నేను చెప్పినట్లు చెయ్యండి"

అని తండ్రిని హెచ్చరించి ప్రక్కకు తప్పుకుంది.

అచ్చమ్మగారతనున్న సావిటిలోకొచ్చి-

"ఇదిగో! వియ్యంకుడుగారు! ఎప్పుడూ రావడం?" అంది.

"ఇప్పుడేనమ్మా! బండి దిగాను"

అని భగవాన్లు జవాబు చెప్పాడు.

"ఉత్తరమయినా రాయకుండా హఠాత్తుగా దిగారు"

"ఈవూళ్ళో వేరే పనివుండి వచ్చా"

"అలాగా? ఏమే కోడలుపిల్లా! మీ నాన్నగారొచ్చారు- ఏం జేస్తున్నావూ?"

అని అత్తగారు పిలిచినప్పుడు పున్నమ్మ ఏమీ యెరగనట్టు యివతల కొచ్చి-

"ఎప్పుడొచ్చావు నాన్నా?"

అని అడిగింది.

"ఇప్పుడేనమ్మా! బండి దిగాను-"

"అంతా కులాసాగా ఉన్నారా?"

"ఆ!"

"క్షేమ సమాచారం తరువాత అడగొచ్చునుగానీ- ముందు మీ నాన్నగారికి కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళు, దాహం కావాలేమో ఇయ్యి!"

అంది అచ్చమ్మగారు. అప్పుడు పున్నమ్మ తండ్రిగారికి కాళ్ళు కడుక్కోడానికి- దాహానికీ నీళ్ళు పట్టుకొచ్చింది.

భగవాన్లు కాళ్ళు కడుక్కుని దాహం పుచ్చుకుని కూర్చున్న అనంతరం-

"మీ అమ్మాయికి మేము అన్నమే పెట్టడం లేదో- నీళ్ళే ఈయడం లేదో- కొడుతున్నామో- తిడుతున్నామో అడగండి నాయనా!"

అంది అచ్చమ్మగారు.

"మీరలా యెందుకు చేస్తారండీ! కోడల్ని తెచ్చుకున్నాదందుకాండీ?"

"మీకు కోపమొస్తే వచ్చిందిగానండీ, మీ అమ్మాయికి ఒక్క పనీ చేతగాదు- ఒక్కపాట చేతకాదు- ఉద్యోగస్తుడయిన మొగుణ్ణి ఎలా గౌరవం చేసుకోవాలో తెలియదు"

"చిన్నతనంగదా అమ్మా! చాలా గారంగా పెంచాము-"

"గారాలు గీరాలూ కన్నవారింటిదగ్గర పనికొస్తాయిగాని, అత్తవారింటి దగ్గర పనికొస్తాయటండీ?"

"నిజమేగానండీ! క్రమంగా అదే నేర్చుకుంటుంది"

"అన్నింటికీ తోడు- పెంకితనమొకటి జాస్తీ"

"ఏదోనమ్మా! మా కడుపులో బిడ్డను మీ కడుపులో పడేశాము. మీరు సరిపెట్టుకోకపోతే యింకెవరు సరిపెట్టుకుంటారు?"

"సరిపెట్టుకోక ఏం జేస్తున్నాము? కొడుతున్నామా? తిడుతున్నామా? కనిపెంచినవారు గాబట్టి మీతో చెబుతున్నాను"

"అలాగేనమ్మా! అలాగే!"

"మొగుడు ఉద్యోగం చేస్తున్నాడన్నా గౌరవం గోరంతయినా లేదండీ మీ అమ్మాయికి- భర్తనో గడ్డిపోచకింద తీసి పారేస్తుంది"

"నేను కోప్పడతానులెండి- బుద్ధిగావుండమని చెబుతా-"

"ఏమో- ఏంజేస్తారో-"

అని వారందరూ మాట్లాడుతుండగా ఆమదాలు వచ్చాడు. అవతల నుంచే మామగార్ని చూశాడు.

దబ్బున మెడలోని బంట్రోతు డవాలు తీసేసి మడిచి చొక్కాజేబులో పెట్టుకుని, తలపాగా కండువాను ఊడలాగి, దానిమీద కప్పుకొని లోపలి కొచ్చాడు.

"ఒహో! మామగారల్లే ఉన్నారు- ఎప్పుడొచ్చారండోయ్!"

అని పరామర్శించాడు.

"ఇప్పుడే వచ్చానోయ్, అంతా ఓ అరగంటయింది. ఖులాసాగా వున్నావా?"

"ఏం కులాసాలెండి- ఉద్యోగం చెయ్యడం మహాకష్టం, వందమంది పాకీవాళ్లమీద అధికారం చలాయించాలి"

"అంటే నాకు తెలియదు-"

"దానికంతా చాలావుందిలెండి- భోజనానికి పొద్దుపోయిందల్లే ఉంది. స్నానానికి లేవండి"

అని అచ్చమ్మగారు హెచ్చరించడంతోనే భగవానులు లేచాడు.

"మీ ఆయనకూ, మీ నాన్నగారికీ వడ్డించమ్మాయీ!"

అని అత్తగారు కోడల్ని హెచ్చరించింది.

"నాకు స్నానానికి వేడినీళ్లు పెట్టావుటే?"

అని ఆమదాలు భార్యనడిగాడు.

"మండుతున్న వేసంకాలంలో వేడినీళ్ళేమిటోయ్?"

అని భగవాన్లు అల్లుణ్ణి ఆశ్చర్యంగా అడిగాడు.

"ఉద్యోగం చేసి చేసి వస్తాడుగాదండీ! అంచేత కాసిన్ని వేడినీళ్ళు పోసుకుంటే, ప్రాణానికి హాయిగా వుంటుంది!"

అని అచ్చమ్మగారు సర్ది చెప్పింది.

"సాయంకాలమయితే అలాగే! నిప్పులు కురుస్తున్నా పన్నెండు గంటల మధ్యాహ్నం వేళ వేడినీళ్ళు ఏం సుఖమో!"

"ఉద్యోగం చేస్తున్నప్పటినుంచీ మావాడికిదే అలవాటులెండి"

అనంతరం భగవానులా విషయమై యిహనేమీ ప్రశ్నించలేదు.

పున్నమ్మ వారి సంభాషణనంతటినీ ఆలకించి తనలో తానే నవ్వుకుంది. అనంతరం అల్లుడు మామలిద్దరూ భోజనానికి లేచారు.

పున్నమ్మ ఆ యిద్దరకూ వడ్డించింది.

"మీ కూతురు వంట చెయ్యడము- మీరు భోజనం చెయ్యడము- యిదే మొదటిసారనుకుంటాను. కూతురువంట- కడుపునిండా భోజనం చేయండి నాయనా!"

"అయ్యో! అయ్యో! మా తల్లి, యిన్ని వంటలెప్పుడు నేర్చుకుందండీ! ఇవన్నీ అది చేసినవేనా? వాళ్లమ్మకంటే, యిదే చాలా బాగా చేసింది- వాళ్ళమ్మ చూస్తే ఎంతగా మురిసిపోతుందో!"

అని భగవానులు భోజనంచేస్తూ ఆనందపరవశుడయినాడు.

"ప్రస్తుతం మీరు మురిసిపొండి- ఆ తరువాత తల్లి మురిసిపోతుంది. మీ అమ్మాయి వంటలకీ, మీ అమ్మాయి పనులకి మీరే సంతోషించాలి"

"అదేమండీ? అలా అంటారు?"

"అమ్మాయి నట్టింట పాదం పెట్టినప్పటినుంచీ, నేనుగాని నా కొడుకుగాని ఒక్కపూట కడుపునిండా భోజనం చెయ్యలేదు. ఎందుకు లెండి ఆ గొడవంతా!"

అని కూతుర్ని గురించి వియ్యపురాలంటున్న మాటను విని భగవానులు చాలా కించపడ్డాడు.

భోజనాలయిన అనంతరం ఆమదాలు మామూలుగా ఆఫీసుకో- యెక్కడికో- వెళ్ళిపోయినాడు. భగవానులు చుట్టకాల్చుకుంటూ వీధరుగుమీద కూచున్నాడు. తరువాత అచ్చమ్మగారు కూడా భోజనము ముగించుకొని, తన మామూలు అలవాటు ప్రకారం గుఱ్ఱుకొట్టి నిద్దరపోవడం మొదలుపెట్టింది.

మరోకొంతసేపటికి చుట్ట కాల్చుకోవడం ఆఖరైపోవడంవల్ల, భగవానులు మంచినీళ్ళకోసం లోపలికెళ్ళేటప్పటికి గుఱ్ఱుకొట్టి నిద్దరోతున్న వియ్యపురాలు కనుపించిందేకాని- పున్నమ్మ ఎక్కడా కనుపించకపోవడంవల్ల, అతడు క్రమంగా దొడ్లో కెళ్ళాడు.

నూతిదగ్గర మేటెడు అంట్లు వడేసుకుని తోముతూ కూర్చున్న కూతుర్ని చూచి నిర్ఘాంతపోయాడు.

"ఇదేమిటి తల్లీ! ఈ అంట్లన్నీ నువ్వే తోమాలా? దాసిదిలేదూ?"

"అయ్యో నా బ్రతుకేమని చెప్పను నాన్నా! నిన్ను రమ్మని ఎందుకు రాశాననుకున్నావూ? అత్తగారు నిద్దరోతూందా?"

"ఆ! నిద్దరోతూంది"

"నా పెళ్ళి విషయంలో చాలా పొరబాటు జరిగిపోయింది నాన్నా! ఈ బాధ ఎలాగయినా భరించాలనే అనుకున్నాను- కాని నాకు సాధ్యంకాకపోవడంవల్ల- చివరకు నీకుత్తరం రాశాను- కన్నప్రాణం గాబట్టి ఉత్తరం రాయగానే రెక్కలు కట్టుకుని వాలావు"

అని బేరుమని యేడుస్తూ అంట్లుతోముతున్న ఆ చేతులతోనే తండ్రిని కౌగిలించుకుంది పున్నమ్మ. భగవానులుక్కూడా కళ్ళు చెమ్మగిల్లాయి.

"అల్లుడు మ్యునిసిపల్ ఆఫీసులో పన్నెండు రూపాయల బంట్రోతు నాన్నా! ప్రపంచజ్ఞానం లేని మూర్ఖుడు. ఇంటి దాసీ పనులన్నీ కూడా నేనే చెయ్యడం. నేనెందుకూ విచారించలేదుకానీ, అయినదానికీ, కానిదానికీ తల్లి మాట పట్టుకుని నన్ను ఒళ్ళు హూనమయ్యేటట్లు కొట్టడం- నేనా దెబ్బలను భరించలేక నీకు ఉత్తరం రాశా నాన్నా!"

అని ఏడుస్తూ చెప్పిన కూతురు మాటలు విని ముక్కు మీద వేలేసుకున్నాడు భగవానులు.

"ఈ విషయం యిటువంటిదని యింతకాలమూ యెందుకు రాశావుగాదు తల్లీ! మోసపోయాము. ఈ పద్ధతిలో యీ కాపురం నీకొద్దు తల్లీ! అమ్మ దగ్గరకు వెళ్ళిపోదాంలే- నువ్వే మొగపిల్లాడనుకుంటాము!"

"ఈ రాక్షసులు నన్ను పంపుతారా నాన్నా?"

"ఆ యేర్పాటంతా నేను చేస్తాగా...నువ్వు మెదలకుండా వూరుకో"

అని తండ్రి చెప్పిన మీదట పున్నమ్మ హృదయం కొంచెం శాంతించింది.


★ ★ ★

"ఏమండీ! తల్లి చూడాలంటూంది. అమ్మాయిని ఒకసారి పంపించండి. పదిరోజులపాటుంచుకొని, తిరిగి పంపుతాను-"

"సంవత్సరమయిందా? రెండు సంవత్సరాలయిందా ఆ తల్లికి కూతురుమీద భ్రమారడానికి?"


అని అడిగింది.

"ఎప్పుడూ విడిచిపెట్టి వుండలేదండి- అంచేత ఆరుమాసాలయినప్పటికీ సంవత్సరాలయినట్లే ప్రాకులాడుతోంది"



## తిరిగి టాలీవుడ్‌కి...!

టాలీవుడ్‌లో మంచి పొజిషన్‌లో వున్నప్పుడు బాలీవుడ్‌కు పరుగులు తీయడం మన హీరోయిన్లకు అలవాటే. శ్రీదేవి, జయప్రద...లాంటివారు మినహాయించి మిగిలిన హీరోయిన్లు హిందీలో అంతగా రాణించలేదనే చెప్పొచ్చు. తాజాగా ఆ జాబితాలో శ్రియ కూడా చేరింది. టాలీవుడ్‌ను కాదని బాలీవుడ్‌లో హీరోయిన్‌గా సెటిల్ అవుదామన్న ఆమె ఆశ నెరవేరకపోగా తిరిగి తెలుగు, తమిళ చిత్రాల్లో అవకాశం కోసం ప్రయత్నిస్తోందని సినీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.



"నాదేముందండి? మీ అల్లుడి ఇష్టం- పంపుతే తీసుకెళ్లండి- నేను కాదంటానా? కాదనడానికి నేనెవర్ని?''

"అలా అంటారేమిటి? మీరింటికి పెద్దలు- ఏమోయ్! ఆమదాలూ! అమ్మాయినొకమాటు తీసుకెడతాను''

"నన్ను కూడానా?''

"అలాగే! అభ్యంతరంలేదు. నువ్వూరా..''

అని భగవానులనగా-

"ఇలా వుంటాయి మర్యాదలు''

అంది అచ్చుమ్మగారు.

"ఉద్యోగం చేస్తున్నాడు గదా! ఖాళీ వుండదని మొదట అనలేదండీ! అల్లుణ్ని కూడా తీసుకెళ్ళాలనే నా అభిప్రాయం''

"మాటవరసకలా అన్నానుగాని- వాడెలా వస్తాడులెండి- ఉద్యోగస్తుడికి నిముషం తీరిక వుంటుందా?''

"నేనూ అలాగే అనుకున్నాను- అయితే అల్లుడికి ఏమిటమ్మా ఉద్యోగం?''

"మునిసిపల్ ఆఫీసులో పెద్ద ఉద్యోగస్తుడుంటాడే- అతనికింద చిన్న ఉద్యోగం మావాడికి. చాలా వలుకుబడీ, గౌరవమూ గల వుద్యోగం. బాధ్యతగల ఉద్యోగం. వందమందిమీద అధికారం-''

అని అచ్చమ్మగారింకా యేమేమో చెబుతూనే వుంది. ఇంతలో పున్నమ్మ, అలమారులో నుంచి భర్త డవాలును తీసి మెడలో తగిలించుకొని విరగబడి నవ్వుకొంటూ యివతలకొచ్చింది.

అపుడాముదాలకూ, తల్లికీ ముఖాన కత్తివాటుకు నెత్తురుచుక్క లేకుండా పోయింది.

"అలమారులోనుంచి దాని నెవ్వరు తియ్యమన్నారూ?''

అని అముదాలు కోపంగా అడిగాడు-

"మీ నాయన వచ్చాడనా యేమిటి నీకీ పెంకితనం?''

అంది అచ్చుమ్మగారు.

"మీ అల్లుడుగారికిదే ఉద్యోగం నాన్నగారూ! ఎంత పెద్ద ఉద్యోగమో చూసుకొండి'' అని పున్నమ్మ తిరిగి విరగబడి నవ్వడం మొదలుపెట్టింది. తల్లీకొడుకులిద్దరూ ఆగ్రహమును పట్టలేకపోతూ ఉన్నారు. కాని ఏం చేస్తారు? తండ్రి ఎదురుగా వుండిపోయినాడు గాని, లేకపోతే ఏమయినా చేసి వుందురు.

"ఏమిటోయ్! ఆమదాలూ! నీకు మునిసిపల్ ఆఫీసులో బంట్రోతు నౌఖరీయా? ఆ బిళ్ళమీద అలాగే వుంది''అని మామగారడిటప్పటికి, ఆమదాలు బిక్కమొఖం వేసి తల్లివయిపు చూచాడు.

"అబ్బే! ఆ డవాల్ అబ్బాయిది కాదండీ! మన యింటికొచ్చే ఆఫీసు బంట్రోతుది- వాడు దానిని అప్పుడప్పుడు మన యింటిలో పెట్టుకుంటూ వుంటాడు''

అని అచ్చమ్మగారు అసలు విషయాన్ని మరుగుపరచాలని చూచింది. కూతుర్ని తీసుకెళ్ళిపోయే సమయంలో వారికి కోపం తెప్పించడమెందుకన్న వుద్దేశ్యంతో భగవానులామె చెప్పిన దానిని నమ్మినట్లు నటిస్తూ...

"ఓహో! అదాఅండీ అసలు విషయం? అంతే అయివుంటుంది. పరాసికానికిలా చేసిందన్నమాట-'' అన్నాడు.

"అంతే మామగారూ! అంతే''

అని ఆమదాలు వెంటనే అనేశాడు.

"తెలిసినవారు గాబట్టి మీరు సత్యమును గ్రహించారు- తెలియనివాళ్ళేమనుకుంటారు చెప్పండీ! మీ అమ్మాయి చేసే కొంటిపనులన్నీ యిటువంటివే! భయభక్తులు లేవు- పోయి! ఆ డవాలును అలమారులో పెట్టవేం యింకా?'' అని అచ్చమ్మగారు గద్దించింది. పున్నమ్మ నవ్వుకొంటూ, దానిని పట్టుకెళ్ళి తిరిగి అలమారులో పెట్టి వచ్చి-

"మీ అల్లుడిగారికి వందమంది పాకీవాళ్లమీద అధికారముంది నాన్నగారూ. మీరేమనుకుంటున్నారో!'' అంది.

"ఆఁ! వందమంది మీదా వుంది!''

అని ఆమదాలు సగర్వగా అన్నాడు.

"సరేగాని, అమ్మాయిని తీసుకెళ్లడంలో ఏం చెప్పారూ?''

"ఏంరా ఆమదాలూ! మీమామగారేమిటో అడుగుతున్నారు. ఏమంటావూ?''

"తీసుకెళ్లమనూ. తిరిగి ఎప్పుడు పంపుతారూ?''

"పది రోజుల్లో పంపుతానయ్యా!''

"మేము కొడుతున్నామనీ- తిడుతున్నామనీ- తిండి పెట్టడం లేదనీ మీ అమ్మాయి ఏమయినా చెప్పిందా?''

"అబ్బెబ్బె! అటువంటివేమీ చెప్పలేదమ్మా! నాకు మాత్రం తెలీదూ మీరెటువంటివాళ్ళో!''

"మీ అమ్మాయి బుద్దులు మంచివిగాకపోవడంవల్ల, అటువంటి మాటలు చెబుతే చెప్పనూ చెబుతుందిలెండి- మీరు మాత్రం నమ్మకూడదు''

"నమ్మనండి- యెప్పుడూ నమ్మను- ఈ సాయంకాలం బండికి అమ్మాయిని తీసుకెడతామరీ- తిరిగి సాధ్యమయినంత త్వరలో పంపుతా''

"ఆ మాట మరచిపోవద్దు- అబ్బాయిక్కూడా భార్యయందు అలవాటయింది- విడిచి వుండలేడు''

"అలాగేనమ్మా! తీసుకొస్తానని చెప్పాగా?''

అని వారిని ఒప్పించి, ఎలాగయితేనే, కూతుర్ని తీసుకెళ్ళడానికి ఏర్పాటు చేశాడు.

అనుకున్న ప్రకారంగా ఆ సాయంకాలమే ప్రయాణం సాగింది. ఆ చెరనుంచి విడిపించబడినందుకు పున్నమ్మ ఎంతయినా సంతోషపడింది. రైల్లో తండ్రీకూతుళ్ళిద్దరూ ఆ విషయమును గురించే మాటలాడుతున్నారు.

"మొగుడూ, కాపరమూ వొదిలిపెట్టేశానని చెడ్డ పేరొస్తే ఎలాగా వచ్చిందిగాని నాన్నా! ఆ యమలోక బాధలు మాత్రం తప్పాయి- అటువంటి బాధలు పగవాళ్లకయినా వొద్దు తండ్రీ!''

"నువ్వింతకాలమూ అనవసరంగా పడ్డావమ్మా ఆ బాధలన్నీని, ఈ వుత్తరం రాయడము ఇంతకుముందే రాసివున్నట్లయితే, వెంటనే వచ్చి తీసుకెళ్లిపోనూ?''

"భర్త ఎంత మూర్ఖుడయినా- ఎలాగయినా సహించుకుని, కాపరం చెయ్యాలనే యింతకాలమూ ప్రయత్నం చేశానాన్నా! కాని కొసకు భరించలేకపోయాను గాబట్టి మీకు ఉత్తరం రాశాను''

"అయిందేదో అయిపోయింది. ఇంతటినుంచీ మనస్సును ప్రశాంతంగా వుంచుకో తల్లీ!''

"కన్నవారి దగ్గరున్నప్పుడు నాకేం లోటునాన్నా! ఆ దరిద్రగొట్టు కొంపలో కడుపునిండా అన్నమయినా దొరికేదు కాదు''

అని కూతురు చెప్పిన మాటలన్నీ విని భగవానులు చాలా కించపడ్డాడు. తెలియక అటువంటి సంబంధము చేసినందుకు విచారించాడు. ఇక తిరిగి కూతుర్ని అత్తవారింటికి పంపకూడదని నిశ్చయం చేసుకున్నాడు.

* * *

నరహరి వ్యాపారం రాను రాను యింకా వృద్ధి పొందింది. అతను పట్టినదల్లా బంగారమవుతూంది. కాని అతని మనస్సుకు స్థిమితం లేకుండా వుంది. అతనా స్థితిలోకి రావడానికి కారకురాలయిన అలివేణిని చూడ్డానికతనికి సావకాశం చిక్కడం లేదు. అందుకామె హృదయం ఎంతగానయినా క్షోభిస్తుందని అతనికి తెలుసు.

కాని తనకామెతో సంబంధమున్న విషయం అచ్చుమ్మ మూలంగా వూరంతా అల్లరయిపోవడమువల్ల అతనెక్కువగా సిగ్గుపడుతున్నాడు. క్రమంగా ఈ సమాచారం భార్య అయిన అన్నపూర్ణక్కూడా తెలుస్తుందనీ- ఆ పరిస్థితిని ఎదుర్కొనడానికి తాను సిద్ధంగా వుండాలనీ అతడు నిశ్చయం చేసుకొన్నాడు. చివరకతడనుకొన్న దారుణ సమయమొచ్చింది. అన్నపూర్ణ చిరునవ్వు ముఖంతో అతని దగ్గరకొచ్చి-

"ఏమండీ! మిమ్మల్ని ఒక విషయమడుగుతాను- దాచకుండా చెబుతారా?" అని అడిగింది. తక్షణం అతని గుండెల్లో రాయి పడింది. అలివేణి విషయమునే ఆమె అడగబోతుందని అతడూహించుకొన్నాడు.

"దాచినంతకాలం దాచాను. ఇహ దాచినందువల్ల ప్రయోజనం లేదు. నువ్వడగబోయే విషయం కూడా నాకు తెలుసును. అలివేణిని గురించి నువ్వడగబోతున్నావు- అవునా?"

"ఈవేళ అచ్చుమ్మగారొచ్చిందండి మన యింటికి. అలివేణికి, మీకూ సంబంధముందనీ- ఈ విషయమునే తాను ఆచార్లుగారితో చెబుతే ఆయన లేదని కమ్ముకున్నాడనీ..ఇంకా ఏవేవో చాలా చెప్పిందనుకొండి"

"అందుకు నువ్వేమన్నావు?"

"మావారు అలివేణిని ద్వితీయ భార్యగా వివాహం చేసుకోబోతున్నారు. అందుకు నాకూ యిష్టమే- మధ్య మీరందరూ యెందుకు బాధపడుతారు? అని చెప్పుదెబ్బ కొట్టినట్లుగా చెబుతే ఆమె దవడలు నొక్కుకుంటూ చక్కాపోయింది"

"నిజంగా నువ్వలా చెప్పావా?"

"మీతో అబద్ధమాడను- అలివేణి విషయంలో నేనెప్పుడూ అసూయపడనని మీకిదివరకే చెప్పేగా?"

"అన్నపూర్ణ! ఇప్పుడు నిజంగా నీ వుదారగుణం వెల్లడి అవుతూంది. మనమిటువంటి ఉచ్ఛస్థితికి రావడానికి అలివేణి కారకురాలుసుమా! ఎవరో స్నేహితుడు పెట్టుబడి పెట్టాడనీ, స్టోర్సు పెట్టానని నీకిదివరకు చెప్పాను. స్నేహితుడు కాడు- స్నేహితురాలు. ఆ స్నేహితురాలు అలివేణని చెప్పడానికిప్పుడు ధైర్యం చిక్కింది"

"అలాగటండీ! ఆమె చేసిన ఉపకారాలను మనమీ జన్మలో మరచిపోవచ్చునా?"

"కూడదుగాని- ఈవిషయం తెలుస్తే నీ మనస్సు కింతపడుతుందేమోనని నేను చాలా భయపడ్డాను"

"నా హృదయమంత కుచ్ఛితమయింది కాదు- అలివేణివంటి ఉత్తమురాలిని మీరు ద్వితీయ భార్యగా స్వీకరించాలని నా కోరిక"

అని ఆయిద్దరూ మాటలాడుకొంటుండగా ఆ గుమ్మంముందొక జట్కా బండి ఆగింది. అందులోనుంచి ఆచార్లుగారూ, అలివేణి దిగారు- ఆచార్లుగార్ని చూడగానే నరహరికి గుండెలు వేగంగా కొట్టుకొన్నాయి.

అన్నపూర్ణ ముందుగా యెదురేగి ఆ యిద్దర్నీ ఆహ్వానించింది.

"అక్కా! నీకు నేను చేసింది ద్రోహమే అనుకో- ఇంకేమనుకో నీ ప్రేమ స్వర్గంలో నాకొంచెం భిక్షపెట్టాలి- లేకపోతే నేను బ్రతకలేను"

అంటూ అలివేణి అన్నపూర్ణ పాదాలు పట్టుకోబోయింది. అన్నపూర్ణ ఆమెను లేవదీసి-

"నేనూ సర్వమూ విన్నాను- నువ్వేమీ చెప్పనవసరంలేదు. ఇందుకు మీ నాన్నగారంగీకరిస్తారా?"

అని అడిగినమీదట ఆచార్లు-

"అమ్మా! లోకులకు సంఘానికి భయపడి, నా బిడ్డ జీవితమునింత వరకూ దుమ్ముపాలు చేశాను. అందువల్ల ఏమీ ప్రయోజనం లేదని తెలుసుకొని యిప్పుడు కళ్ళు తెరిచాను.

నరహరినీమె ప్రేమించింది. నీకూ నాకూ తెలియకుండా ఆ యిద్దరూ కొంతకాలం సంచరించారు. తత్ఫలితం అలివేణి ఇప్పుడు గర్భమును ధరించివుంది. కర్తవ్యమును తెలుసుకోలేక యిక్కడికి తీసుకొచ్చాను. నీవేమి నిర్ణయిస్తావో అంతా నీదే భారం" అని చెప్పాడు.

"చాలా సంతోషమయిన మాట చెప్పారు. అలివేణి నాకు చెల్లెలై నా భర్తకు ద్వితీయ భార్యగా వుంది. అందుకు నేను సంతోషంతో అంగీకరించడమే గాకుండా నా భర్తను హెచ్చరించాను"

"నీ హృదయమెంత విశాలమైనదీగాకపోతే యిలా చెయ్యగలవా? మానవుల్లో దేవతా స్వరూపిణిలుంటారని నేనిప్పుడూహించగలుగుతున్నాను" అని ఆచార్లుగారు ఆనందోద్రేకంతో యింకా ఏమేమో చెబుతూనే వున్నాడు.

అన్నపూర్ణ అలివేణి చేతినీ, భర్త చేతిని కలిపి-

"మీ ప్రేమ హృదయంమీద యిప్పుడు మా యిద్దరకూ సమాన హక్కులున్నాయి. అలివేణి నాకు చెల్లెలూ- మీకు ద్వితీయ భార్య- లోకం చేసే దుష్ప్రచారానికి గాని- నిందలకుగాని లెక్కచెయ్యకుండా, మనం ముగ్గురమూ ప్రేమ స్వర్గాన్ని పరిపాలించాలి" అంది.

ఆమె మాటల మాధుర్యాన్ని గ్రోలుతూ, నరహరి ఆ యిరువురను చెరోచేత్తోనూ దగ్గరగా తీసుకున్నాడు- ఆచార్లుగారు వారినాశీర్వదించాడు.

**(సమాప్తం)**

